
చెడు వినకు, చెడు కనకు, చెడు మాట్లాడకు సంజ్ఞలతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

వినం..కనం.. మాట్లాడం

అంగన్‌వాడీల వినూత్న నిరసన 31వ రోజుకు చేరిన సమ్మె

ఒంగోలు నగరం, జనవరి 11 : తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఖరిపై అంగన్‌వాడీలు వినూత్న రీతిలో గురువారం నిరసన తెలిపారు. జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలు నోరు, కళ్లు, చెవులు మూసుకుని ప్రదర్శన నిర్వహించారు. శిబిరాల వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. వారి సమ్మె గురువారానికి 31వ రోజుకు చేరింది. కలెక్టరేట్ వద్ద నిరవధిక దీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం దీక్షలను రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ రీజనల్ నాయకులు వాసుదేవరావు ప్రారంభించారు. వారి పోరాటానికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నేతలు దీక్షా శిబిరాన్ని సందర్శించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ మాణిక్యంఠాగూర్, పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, పార్టీ జిల్లా అధ్యక్షులు ఈదా సుధాకరరెడ్డి తదితరులు సంఘీభావం తెలిపారు. మాణిక్యం ఠాగూరు మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలను పరిష్కరించకుండా వారిని అణచివేసే దిశగా వైసీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవటం అన్యాయమన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీలకు రూ.18వేలు ఇస్తానని హామీ ఇచ్చిందని చెప్పారు. ఇక్కడా ఆ మొత్తం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ వద్ద 24 గంటల దీక్షలో వైపాలెం ప్రాజెక్టుకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు కూర్చున్నారు. జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల కేంద్రాల్లో అంగన్‌వాడీలు దీక్షలో నోరు మూసుకుని కూర్చొని నిరసన వ్యక్తం చేశారు.

యువతకు ఉపాధి ఏదీ?

అన్ని విషయాల్లో వైసీపీ ప్రభుత్వం వైఫల్యం
జాబ్ క్యాలెండర్ విడుదల చేయని జగన్
కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెస్తాం
యువగర్జన ర్యాలీలో పార్టీ నేతలు


మాట్లాడుతున్న ఠాగూర్, వేదికపై మొయిప్పన్, జేడీ శీలం, డేవిడ్‌రాజు, సుధాకర్‌రెడ్డి

ఒంగోలు(క్రైం), జనవరి 11 : యువతకు ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ విమర్శించారు. గురువారం యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో యువగర్జన ర్యాలీ నిర్వహించారు. నగరంలో ప్రకాశం భవన్ నుంచి అద్దంకి బస్టాండ్ వరకు సాగింది. యువజన కాంగ్రెస్ నాయకులు బీఆర్ గౌస్ ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో యువకులు ర్యాలీలో పాల్గొని ఇందిరమ్మ రాజ్యం వస్తే యువతకు ఉపాధి లభిస్తుందని నినాదాలు చేశారు. అనంతరం అద్దంకి బస్టాండ్‌లో జరిగిన బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఈదా సుధాకర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఠాగూరు మాట్లాడుతూ సీఎం జగన్ ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని యువతను మోసం చేశాడని విమర్శించారు. పీసీసీ చీఫ్ గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వానికి తెరవెనుకగా బీజేపీ ప్రభుత్వం మద్దతు ఇస్తుందని చెప్పారు. వైఎస్ మృతిపై అనుమానాలు ఉన్నాయని, సీబీఐ దర్యాప్తు జరిపి నిగ్గుతేల్చాలని కోరారు. షర్మిలకు కాంగ్రెస్ పార్టీలో సముచితస్థానం ఇస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మొయిప్పన్, సిరివెళ్ల ప్రసాద్, జేడీ శీలం, మస్తాన్‌వలి, కొరివి వినయ్‌కుమార్, జంగా గౌతం, తాంతియ కుమారి, పద్మశ్రీ, శ్రీపతి సతీష్, ఉద్దండి మల్లికార్జున్‌రావు, ప్రసన్నకుమార్‌రాజు, నాగలక్ష్మీ, శివార్జున్ తదితరుల పాల్గొన్నారు. డాక్టర్ అనిల్ ఆధ్వర్యంలో ఎర్రగొండపాలెం నుంచి 150 మంది పార్టీలో చేరారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజుకు కాంగ్రెస్ కండువాలు కప్పి స్వాగతం పలికారు.



వచ్చేది లేదు!

నేడు కొండపి- ఎస్‌ఎన్‌పాడు సమావేశాలు | రాలేమని చెప్పిన బాలినేని, మాగుంట

వారి అనుచరులు గైర్హాజరయ్యే అవకాశం
నెలరోజుల కసరత్తు తర్వాత నిర్వహణ
వైసీపీలో ఆసక్తికరంగా తాజా వ్యవహారం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ముఖ్య నాయకులందరూ హాజరయ్యే విధంగా రమారమి నెలరోజుల కసరత్తు అనంతరం శుక్రవారం కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాల వైసీపీ సమావేశాలు నిర్వహించనున్నారు. ఆ రెండు నియోజకవర్గాలకు కొత్త ఇన్‌చార్జిలుగా మంత్రులు సురేష్, మేరుగ నాగార్జునలను నియమించిన విషయం తెలిసిందే. అయితే నియోజకవర్గాల్లోని కొందరు నాయకులు వారి నియామకాన్ని వ్యతిరేకించటం, ముఖ్యంగా ఎంపీ మాగుంట, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిలు సమావేశానికి హాజరుకాబోమని చెప్పటంతో వారి రాక కోసం అధికారికంగా కార్యకర్తల సమావేశాలు ఇంతవరకు జరపలేదు. అయితే తాజాగా శుక్రవారం ఈ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. మాగుంట, బాలినేనిలను సీఎం దూరంగా పెట్టారన్న వార్తల నేపథ్యంలో వారు రాబోరని తెలుస్తోంది.

మాగుంట, బాలినేనిలను సీఎం పక్కన పెట్టినట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో సాయిరెడ్డి సారథ్యంలో శుక్రవారం కొండపి, ఎస్‌ఎన్‌పాడు సమావేశాల నిర్వహణ ఆసక్తికరంగా మారింది. ఆ రెంటికీ హాజరుకావాలని [illegible]నేనికి సూచించగా, తాను రానని తాను ఒంగో[illegible] పరిమితమని తేల్చిచెప్పినట్లు తెలిసింది. కొం[illegible] సమావేశానికి హాజరుకావాలని మాగుంటకు మ[illegible] సురేష్ ఫోన్ చేసి ఆహ్వానించగా ఆయన కూడా [illegible]ని తేల్చిచెప్పినట్లు తెలిసింది. బాలినేని హైదరాబ[illegible]లో ఉండగా, మాగుంట శుక్ర, శని వారాలు [illegible]లో ఉండనున్నారు. అయినా ఆయన కార్యక్రమాల్లో కొండపి సమావేశం అంశం లేకపోవటంతో వెళ్లరని స్పష్టమవుతోంది.

కీలక నాయకులు అనుమానమే

ఇంకోవైపు ఈ రెండు సమావేశాలకు ఆయా నియోజకవర్గాల్లోని పలువురు ముఖ్య నాయకులు కూడా గైర్హాజరయ్యే అవకాశం కనిపిస్తోంది ఉదయం 10.30కు కొండపిలో ఆ నియోజకవర్గ సమావేశంను, సాయంత్రం 3గంటలకు ఒంగోలులోని విష్ణుప్రియ కల్యాణ మండపంలో ఎస్‌ఎన్‌పాడు సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ కొత్త ఇన్‌చార్జిలు అయిన మంత్రులు సురేష్, నాగార్జునల పరిచయ కార్యక్రమం పేరుతో ఏర్పాటు చేసిన ఈ సమావేశాలకు ప్రతి మండలం నుంచి 50 మంది వరకు ఆహ్వానాలు పంపినట్లు తెలిసింది. మంత్రి సురేష్ అయితే నియోజకవర్గంలోని పలువురు నాయకులకు తన కార్యాలయం నుంచి కూడా సమావేశానికి రావాలని సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు ఐప్యాక్ ప్రతినిధులు ముఖ్య నాయకులందరికీ ఫోన్ చేసి సమావేశానికి హాజరుకావాలని కోరుతున్నారు. కొండపి సమావేశానికి ప్రభుత్వ సలహాదారుడు జూపూడి ప్రభాకర్‌రావు, డాక్టర్ వెంకయ్య తదితరులు కూడా హాజరుకాకపోవచ్చని తెలుస్తోంది. వేమూరు ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన అశోక్‌బాబు హాజరయ్యే అవకాశం ఉంది. ఇక కొండపి నియోజకవర్గంలో అటు మాగుంటకు, ఇటు బాలినేనికి బలమైన అనుచరగణం ఉంది. వారిలో ఎంతమంది హాజరవుతారు, ఎవరు డుమ్మా కొడతారో చూడాల్సి ఉంది. ఎస్‌ఎన్‌పాడుకు సంబంధించి ఇటీవల ఎమ్మెల్యే సుధాకర్‌బాబు అనుచరులు, వ్యతిరేకులు రెండు గ్రూపుల్లోనూ తటస్థంగా ఉన్న బాలినేని అనుచరులు సమావేశమై తమ నేత వచ్చేవరకు తాము నాగార్జునకు మద్దతు ఇవ్వబోమని బహిరంగంగానే ప్రకటించారు. ఈనేపథ్యంలో బాలినేని సమావేశానికి రాకపోవటం, ఎమ్మెల్యేకు అసలు ఆహ్వానమే లేకపోవటంతో నియోజకవర్గంలోని నాయకులు ఏ స్థాయిలో హాజరవుతారనే అంశానికి ప్రత్యేక ప్రాధాన్యత నెలకొంది. ఇంకోవైపు మార్కాపురం టికెట్ ఆశిస్తున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డికి పార్టీ అవకాశం ఇస్తుందా లేదా అనే అంశం అధికారికంగా ఖరారు కాలేదు. దీంతో జంకె వెంకటరెడ్డి సమావేశానికి హాజరవుతారా లేదా అనేది చూడాల్సి ఉంది.



సంతనూతలపాడు నియోజకవర్గ సమావేశానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఎమ్మెల్యే సుధాకర్‌కు ఆహ్వానమే లేదు

ఎస్‌ఎన్‌పాడు నియోజకవర్గ సమావేశానికి ఆ పార్టీ ఎమ్మెల్యే సుధాకర్ బాబుకు ఆహ్వానమే లేనట్లు తెలుస్తోంది. ఆ సమావేశంకు జిల్లా పార్టీ పేరుతో నియోజకవర్గంలోని నాయకులకు పంపిన సమాచారంలో చిన్న పెద్ద నాయకుల పేర్లు ఉన్నప్పటికీ ఎమ్మెల్యే పేరు లేకపోవటం విశేషం. దీంతో తనకు ఎక్కడా టికెట్ కేటాయించని నేపథ్యంలో అసంతృప్తిలో ఉన్న సుధాకర్‌బాబును అధిష్ఠానం కూడా పట్టించుకోలేదనే విషయం వెల్లడవుతోందని ఆయన అనుచరులు భావిస్తున్నారు.

మద్దిశెట్టికి దొరకని అవకాశం

మార్కాపురంపై మళ్లీ ప్రతిష్టంభన
ఒంగోలుపై ముందుకు పడని అడుగు
అనుకున్నట్లే బూచేపల్లికి చాన్స్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అధికార వైసీపీ మూడో జాబితాలో ముందునుంచి అనుకున్నట్లే దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టిని తొలగించి బూచేపల్లి శివప్రసాదరెడ్డికి వైసీపీ అధిష్ఠానం అవకాశం ఇచ్చింది. మరోచోట అవకాశం ఇవ్వాలని మద్దిశెట్టి కోరినా ఈ జాబితాలో ఆయనకు స్థానం దక్కలేదు. మార్కాపురంపై మళ్లీ ప్రతిష్టంభన నెలకొనగా ఒంగోలు లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థులపైనా నిర్ణయం తీసుకోకపోవటం చర్చనీయాంశమైంది. వైసీపీ మూడో జాబితాను గురువారంరాత్రి విడుదల చేసింది. దర్శి ఇన్‌చార్జిని మాత్రమే మార్పుచేసి మిగిలినచోట్ల ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించలేదు. ఇటీవల సీఎం మాట్లాడినప్పుడు మద్దిశెట్టి తనకు దర్శి కానప్పుడు ఒంగోలు లోక్‌సభ నుంచి పోటీకి అవకాశం ఇవ్వాలని కోరారు. ఆ సందర్భంగా ఒంగోలు అసెంబ్లీ వ్యవహారం కూడా వారి మధ్య చర్చకు వచ్చింది. ఎక్కడా అవకాశం ఇవ్వకపోతే తన స్పందన ఏమిటో అప్పుడు తెలియజేస్తానని మద్దిశెట్టి ప్రకటించి ఉన్నారు. మార్కాపురానికి జంకెను అభ్యర్థిగా దించాలని భావించిన సీఎం జగన్ నాలుగురోజుల క్రితం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని పిలిచి మాట్లాడారు. గురువారం విడుదలైన జాబితాలో మార్కాపురం విషయాన్ని తేల్చలేదు. తనకు చెప్పి కూడా జాబితాలో అవకాశం ఇవ్వకపోవటంపై జంకె అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. కందుకూరు నుంచి యాదవ సామాజిక వర్గం అభ్యర్థిని రంగంలోకి తెచ్చి ఎమ్మెల్యే మహీధరరెడ్డిని పక్కన పెట్టాలని చూస్తున్న సీఎం.. నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి ఎంపికతో ఉన్న సంబంధంతో దానిపైనా తుదినిర్ణయం తీసుకోలేదని సమాచారం. దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌కు మూడో జాబితాలో చోటు కల్పించకపోవడంపై ఆయన అనుచరులు కూడా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆయనకు ఎక్కడా అవకాశం ఇవ్వకపోతే తమదారి తాము చూసుకుంటామని స్పష్టం చేస్తున్నారు. దీంతో రానున్న కొద్దిరోజుల్లో వైసీపీ నుంచి ఇతర పార్టీల్లోకి జిల్లాలో భారీగా వలసలు కొనసాగే అవకాశం కనిపిస్తోంది.



కలర్‌ఫుల్ : రంగులమయమైన నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని టెన్నిస్ కోర్టు



హరివిల్లు.. సిరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ
గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు
11 మందికి కన్సొలేషన్ బహుమతులు
బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి


ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు


పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.
- ఏ.సునీత, గుంటూరు జిల్లా

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.
- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.
- రాధ, తమిళనాడు

కెనరా బ్యాంక్
केनरा बैंक
Canara Bank
A Government of India Undertaking
Together We Can
ఆంధ్రజ్యోతి
ABN
AIMS INSTITUTES
Peenya, Bangalore
+91 81500 01994
SWARGASEEMA SUKETANA
Ph: + 91 98490 12500



విజేతలు వీరే.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)


ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే స్వామి, టీడీపీ నేతలు

రానున్న ఎన్నికల్లో వైసీపీ అడ్రస్ గల్లంతు

● కొండపి ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, జనవరి 11 : మరో రెండు నెలల్లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అడ్రస్ గల్లంతవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. సంక్షోభంలో కూరుకుపోయిన ఆంధ్రప్రదేశ్‌ను సంక్షేమబాట పట్టించాలంటే ముందుచూపు, దార్శనికత ఉన్న చంద్రబాబుతోనే సాధ్యమని చెప్పారు. పంచాయతీ పరిధిలోని పాకలరోడ్డు నుంచి ట్రంకురోడ్డుకు ఇరువైపులా దుకాణాల వద్ద గురువారం నిర్వహించిన బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో స్వామి మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల విధ్వంస పాలనలో ప్రజలు విసిగెత్తిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనానికి రూపాయి పంచి రూ. పది దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ నేతల వికృత చేష్టల పోకడల వలన వ్యాపార రంగం చిన్నాభిన్నమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, షేక్ సంధానీబాషా, కూనపరెడ్డి సుబ్బారావు, సుదర్శి చంటి, పులి ప్రసాద్, పాకల సర్పంచ్ చంద్రశేఖర్, భైరననేని మోహన్‌రావు, ఇమ్మిడిశెట్టి రామారావు, గుదే వెంకటేశ్వర్లు, చిగురుపాటి గిరి, మించల బ్రహ్మయ్య, వేల్పుల వెంకట్రావు, బ్రహ్మేశ్వరరావు, అబ్దుల్ సుభాన్, యస్దాని, సనావుల్లా, మాబాషా, సన్నెబోయిన మాలకొండయ్య, కాకా శ్రీనివాసులు, రావులపల్లి వెంకట్రావు, కళ్లగుంట నరసింహ, దక్షిణం శ్రీను, శీలం చంటి, జుమ్ము శంకర్, తుమ్మా కోటేశ్వరరావు, జనసేన నేతలు అడుసుమల్లి సుధాకర్, దండే ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు కూడారై వెళ్లుమ్ ఉత్సవం

ఒంగోలు (కల్చరల్),జనవరి 11: ధనుర్మాసంలో పఠించే తిరుప్పావై 27వ పాశురం సందర్భంగా నేడు నగరంలోని పలు దేవాలయాలలో కూడారై వెళ్లుమ్ ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. ధనుర్మాసం ప్రారంభమైన 27వ రోజునే గోదాదేవి శ్రీకృష్ణునికి ఈ ఉత్సవాన్ని నిర్వహించి పాయసాన్ని నివేదన చేసిందని ప్రతీతి. దీంతో వైష్ణవ ఆలయాలలో కూడారై వెళ్లుమ్ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. స్థానిక గడియారం వారి వీధిలోని శ్రీ అనంత కోదండరామ స్వామి దేవస్థానంలో 108 గంగాళాలతో పాయసాన్ని తయారుచేసి ఉదయం 7 గంటలకు ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు గడియారం సుబ్బయ్య శర్మ తెలిపారు. అదేవిధంగా స్థానిక కేశవస్వామిపేట శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో సైతం ఉదయం 10 గంటలకు గోదాదేవికి కూడారై వెళ్లుమ్ నిర్వహించి పాయసాన్ని సమర్పించనున్నట్లు దేవస్థాన పాలకమండలి అధ్యక్షులు ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వహణాధికారి డి.రజనీకుమారిలు తెలిపారు. అదేవిధంగా శనివారం శ్రవణా నక్షత్రం సందర్భంగా రాత్రి 7 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం, 14వ తేదీ ఆదివారం రాత్రి 7 గంటల నుంచి గోదారంగనాథుల కల్యాణం నిర్వహించనున్నట్లు వారు ఒక ప్రకటనలో తెలిపారు.

వైసీపీ ప్రభుత్వ పతనం ఖాయం

టీడీపీ బీసీ సెల్ నేతలు

ఒంగోలు (కార్పొరేషన్), జనవరి 11 : జిల్లాలోని కనిగిరిలో చేపట్టిన రా... కదలి రా. ! చంద్రబాబు నాయుడు సభతో జిల్లాలోని అన్నీ సీట్లు తెలుగుదేశం ప్రభుత్వం గెలవబోతుందని, రాష్ట్రంలో వైసీపీ పతన ఖాయమని తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ నాయకులు పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశలో నాయకులు మాట్లాడుతూ జగన్ విధ్వంస పాలనకు ప్రజలు తీర్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. నాలుగున్నరేళ్ళుగా ఒక్క అభివృద్ధి చేయలేకపోయిన వైసీపీ ప్రభుత్వం జె. బ్రాండ్‌లు మద్యం, ఇసుక, మైనింగ్, భూ కబ్జాలతో దోచుకోవడమే కాకుండా, ఇష్టారాజ్యంగా ధరలు పెంచేసిందని దుయ్యబట్టారు. మరో వైపు ఆర్టీసీ , కరెంటు చార్జీలు, గ్యాస్, ఇతరత్రా అన్నింటిని పెంచేసి ప్రజలను దోచుకుందున్నారు. బటన్ నొక్కి పథకాలతో ప్రజలను మోసం చేస్తున్న జగన్‌కు అదే బటన్ నొక్కి ఇంటికి సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. తెలుగుదేశం పార్టీ మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. ఇప్పటికే బాబూ ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని అన్నీ వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తామని తెలిపారు. ప్రజల ఆశీస్సులు అందించి టీడీపీని గెలిపించాలని కోరారు. మీడియా సమావేశంలో నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెళ్ళూరు చిన వెంకటేశ్వర్లు, ఆవుల శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ ఒంగోలు పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాయకులు గవదకట్ల హరికృష్ణ, పాలూరి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ళ పాలనలో రాష్ట్రానికి జరిగిన అభివృద్ధి శూన్యమని అన్నారు. వైసీపీ పాలన నుంచి ప్రజలను కాపాడి స్వర్ణయుగం రావాలన్నారు. అది తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ శ్రేణులు

చంద్రన్న కార్మిక చైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన చంద్రన్న కార్మిక బస్సు యాత్ర పోస్టర్‌ను గురువారం ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబూరి సింధూజ మాట్లాడుతూ ఈనెల 3వ వారంలో కార్మిక చైతన్య బస్సు యాత్ర జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. టీఎన్‌టీయూసీ నాయకులు, అన్నీ కార్మిక సంఘాల నేతలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ అధ్యక్ష, కార్యదర్శులు కొక్కెర నాగరాజు, ఈదురు మల్లయ్య పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో బీసీలకు అన్యాయం

వైసీపీ పాలనలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అడక స్వాములు విమర్శించారు. గురువారం టీడీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్ విజయ్‌కుమార్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు తగిన గౌరవం దక్కలేదన్నారు.

ఆపార్టీలోని బీసీలు పెద్దిరెడ్డి, విజయసాయి రెడ్డి, సుబ్బారెడ్డి, సజ్జల ముందు బానిసలుగా తల వంచారని అన్నారు. ఆ పార్టీలోని బీసీలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారని డాక్టర్ సంజీవ్‌లాగానే మరి కొందరు వైసీపీని వీడబోతున్నారని ఆయన అన్నారు. ఈ నాలుగున్నరేళ్ళలో బీసీ సామాజిక వర్గానికి చేసింది ఏమీ లేదన్నారు. బీసీ యువతకు సరైన విద్యా ప్రోత్సాహకాలు లభించడం లేదని, తెలుగుదేశం అధికారంలోకి రాగానే బీసీలకు అన్నీ రంగాల్లో పెద్ద పీట వేసే దిశగా చంద్రబాబు చర్యలు చేపట్టారని అన్నారు. మీడియా సమావేశంలో ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై 16 నుంచి ప్రత్యక్ష ఆందోళన

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 11 : అంగన్‌వాడీల న్యాయసమత్తమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఈ నెల 16వతేదీ నుంచి ప్రత్యక్ష పోరాటాన్ని ఉధృతం చేస్తామని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు హెచ్చరించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో గురువారం సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలు రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో టీడీపీ నేత కామేపల్లి శ్రీనివాసరావు, జనసేన పార్టీ నేత మలగా రమేష్, సమాజ్‌వాది పార్టీనేత పాశం వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, న్యూడెమోక్రసి నాయకుడు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సీపీఐఎంఎల్ నాయకుడు డీవీఎన్ స్వామి, ఆమ్ ఆద్మీ పార్టీ నేత సుదర్శన్, లోక్‌సత్తా పార్టీ నేత మహ్మద్ రఫీ, కాంగ్రెస్ పార్టీ నేత ఈదా సుధాకర్‌రెడ్డి, ఐఎల్‌పీ నేత దాసరి సుందర్శనంలు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుండా ఎస్మా చట్టాన్ని తీసుకురావటాన్ని తప్పుపట్టారు. ఈ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు గతంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అంగన్‌వాడీలు నిర్వహించే సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొంటామని ఆయా పార్టీల నాయకులు హెచ్చరించారు.


రౌండ్‌టేబుల్ సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు

ఈ రౌంట్‌టేబుల్ సమావేశంలో వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు చుండూరి రంగారావు, నార్నే వెంకట సుబ్బయ్య, జి. నరసింహారావు, మారెళ్ల సుబ్బారావు, సీహెచ్ రాంబాబు, జీవీ కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, జి. రమేష్, ఎస్. వెంకటేశ్వర్లు, వి. బాలకోటయ్య, రఘురాం, కే రమాదేవి, కేఎఫ్‌బాబు, విజయ్, సయ్యద్ హుస్సేన్, ఏ రాఘవులు, తంబి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

కొండపి, : అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాలం సుబ్బారావు చెప్పారు. కొండపిలో అంగన్‌వాడీలు చేస్తున్న నిరసన శిబిరంలో ఆయన గురువారం పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గంటెనపల్లి వెంకటేశ్వర్లు, జయప్రద, కేజీ మస్తాన్, వందనం పాల్గొన్నారు.



వడ్డీ లేని రుణాలను వినియోగించుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 11 : సంప్రదాయ వృత్తిదారులకు, చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తూ ప్రభుత్వం తోడుగా ఉంటుందని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. జగనన్న తోడు పథకంలో భాగంగా తాడేపల్లి నుంచి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బటన్ నొక్కి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ పథకం కింద అర్హులకు ఎటువంటి పూచీకత్తు లేకుండా ప్రతి ఒక్కరికి బ్యాంకు ద్వారా రూ. 10వేల రుణ సహాయం ప్రభుత్వం అందజేస్తున్నట్లు తెలిపారు. తిరిగి చెల్లించిన వారికి అదనంగా రూ. వెయ్యి కలిపి రూ. 11వేలు, రెన్యూవల్ రుణం ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఈ విడతలో 24,171 మంది లబ్ధిదారులకు రూ. 46.95 లక్షల వడ్డీ రాయితీ కూడా జమ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు రుణాలు, వడ్డీ రాయితీకి సంబంధించిన బ్యాంకు చెక్కులను మేయర్ గంగాడ సుజాతతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు వసుంధర, రవికుమార్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ మహబూబ్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మాధవి తదితరులు ఉన్నారు.


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న కలెక్టర్

సమ్మె బాటన సెర్ప్ ఉద్యోగులు

కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేసిన వైఎస్సార్‌కేపీ సిబ్బంది

22లోగా సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన

ఒంగోలు నగరం, జనవరి 11: అంగన్‌వాడీలు, సమగ్రశిక్ష, పారిశుధ్య కార్మికులు తమ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ సమ్మె బాట పట్టగా ఇప్పుడు రాష్ట్ర పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) ఉద్యోగులు కూడా అదే బాట పట్టనున్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 22వ తేదీ నుంచి సమ్మెకు దిగనున్నట్లు గురువారం ప్రకాశం జిల్లా సెర్ప్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ నరేంద్రకుమార్, కార్యదర్శి జి.రాంబాబు, కన్వీనర్ రామకృష్ణ తదితరులు కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తమ సమస్యలు పరిష్కారం కాకపోతే 22వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్ళనున్నట్లు లిఖితపూర్వకంగా తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సెర్ప్ ఉద్యోగులు సమ్మె బాట పడితే నవరత్నాలు ఆగిపోయే అవకాశం ఉంది. రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులు ఆందోళన బాట పడుతున్న నేపథ్యంలో సెర్ప్ ఉద్యోగులు కూడా సమ్మెకు దిగనున్నారు. మొత్తంగా జిల్లాలో 250 మంది సెర్ప్ ఉద్యోగులు ఉన్నారు.


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సెర్ప్ ఉద్యోగులు

జగనన్నా! ఇకనైనా మా మొర ఆలకించన్నా!!

టంగుటూరు, జనవరి 11 : 'జగనన్నా! ఈ ఏడాది మాకు పండుగే లేదు, ఇల్లు అలికింది లేదు, ఇంటి ముందు ముగ్గు పెట్టిందీ లేదు, పండక్కి బట్టలేవని పిల్లలు గోల చేస్తున్నారు. వారికి సమాధానం ఏమి చెప్పాలో తెలియడం లేదు, ఇళ్లలో పిండివంటల వాసనే లేదు, పండుగ పూట ఇంటి వద్ద అంతా అలజడే, మా గోడు పిల్లలకు ఎలా చెప్పాలి? ఏమని చెప్పాలి? ఏమి అర్థం కావడం లేదు, అన్నా ఇకనైనా మామొర ఆలకించన్నా' అని అంగనవాడీ కార్యకర్తలు వేడుకుంటున్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వేదికగా జరుగుతున్న అంగన్‌వాడీల సమ్మె 31వ రోజైన గురువారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు తమ గోడును వెళ్లబోశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు ఆందోళనను ఆపేది లేదని, ఈ పండుగ కాకుంటే వచ్చే ఏడాది పండుగ చేసుకుంటామని వారంతా ప్రతినబూనారు. కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టీ రాము, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వీ మోజెస్, అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శేషమ్మ, క్రాంతి నాయకత్వం వహించారు.


నిరసన కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 11 : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి శుక్ర, శనివారాల్లో ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. శుక్రవారం ఉదయం పది గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం ఏడు గంటలకు శ్రీ సరస్వతి విద్యాసంస్థల 33వ వార్షిక వేడుకల్లో మాగుంట పాల్గొంటారు. శనివారం ఉదయం 11 గంటలకు కొరిశపాడు మండలం రావినూతలలో ప్రముఖ సినీనటుడు రఘుబాబు నివాసంలో జరిగే కార్యక్రమంలో మాగుంట పాల్గొంటారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 11 : వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను అర్హతకు అనుగుణంగా రెగ్యులర్ చేయడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్. రాజ్యలక్ష్మి గురువారం తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయిస్తామని కొంతమంది దళారులు చెప్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అటువంటి వారిమాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగుల అర్హతను బట్టి ఉన్నతాధికారులు రెగ్యులర్ చేస్తారన్నారు. కానీ కొంతమంది దళారులు తాము రెగ్యులర్ చేయిస్తామని డబ్బులు అడిగినా ఎవరూ ఇవ్వవద్దని కోరారు.

రెండు వైద్యశాలలకు షోకాజ్ నోటీసులు జారీ

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 11 : జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రెండు ప్రైవేటు వైద్యశాలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్. రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలోతెలిపారు. పీసీపీఎన్‌డీటీయాక్టు ప్రకారం జిల్లాలోని డయాగ్నస్టిక్ స్కాన్ సెంటర్లు, ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్ తప్పని సరిగా ఉండాలన్నారు. రిజిస్ట్రేషన్ ఉన్న వారు రెన్యువల్ క్రమం తప్పకుండా చేసుకోవాలని, లేనిపక్షంలో రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి ఆస్పత్రి సీజ్‌చేస్తామని తెలిపారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రగతి నర్సింగ్ హోమ్, కందుల ఓబుల్‌రెడ్డి ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు.

నేడు పండ్ల మొక్కల పంపిణీ

టంగుటూరు, జనవరి 11 : మండలంలోని కారుమంచిలో మాఊరి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యాన ఈనెల 12వ తేదీ ఉదయం 11గంటల నుంచి స్థానిక ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో ఇంటింటికీ పండ్ల మొక్కల పంపిణీ జరుగుతుందని కమిటీ అధ్యక్షుడు వల్లరెడ్డి లక్ష్మణరెడ్డి గురువారం తెలిపారు. హైబ్రీడ్ కొబ్బరి, బంగినపల్లి మామిడి కుటుంబానికి ఒక్కొక్క మొక్క వంతున మొత్తం వేయి మొక్కలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

కొండపి, జనవరి 11 : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై వై. నాగరాజు సూచించారు. కొండపిలోని చాణక్య జూనియర్ కళాశాల వార్షికోత్సవంలో ఆయన గురువారం మధ్యాహ్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండపి ఎంఈవో-2 పి. రామారావు, జరుగుమల్లి ఎంఈవో బత్తుల నాగేంద్రవదన్, బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు పర్రె వెంకటరావు మాట్లాడారు. ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

జిల్లా కవులకు సంక్రాంతి పురస్కారాలు

ఒంగోలు (కల్చరల్),జనవరి 11:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాహిత్య సంక్రాంతి కార్యక్రమంలో మన జిల్లాకు చెందిన కవులకు సంక్రాంతి పురస్కారాలు లభించాయి. ఏలూరు వైఎంహెచ్ఏ హాలులో గురువారం ఉదయం నిర్వహించిన ఈ ఉత్సవాలలో ఒంగోలుకు చెందిన కవయిత్రి పరాంకుశం కృష్ణవేణి, రచయిత జాలాది మోహన్‌లను నిర్వాహకులు, అతిథులు సంక్రాంతి పురస్కారంతో ఘనంగా సత్కరించారు.

కోడిపందేలు, పేకాడితే చర్యలు

టంగుటూరు, జనవరి 11 : సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడిపందాలు, పేకాట ఆడితే కఠిన చర్యలుంటాయని ఎస్సై ఖాదర్‌బాషా హెచ్చరించారు. సంక్రాంతి సంప్రదాయ క్రీడల పేరుతో ఇలాంటి ఆటలు నిషేధం అని తెలిపారు.

అవీ..ఇవీ..

ఉద్యోగ అవకాశాలు పెంచే దిశగా చర్యలు

ఒంగోలు(కలెక్టరేట్); జనవరి 11 : యువతకు ఉద్యోగ అవకాశాలు పెంచే దిశగా ప్రభుత్వం మరో ముందడుగు వేసిందని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక కలెక్టర్ బంగ్లాలో గురువారం సాయంత్రం ఆన్‌లైన్ ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్ వెబ్‌సైట్ పోర్టల్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉపాధి అవకాశాల సమాచారం తెలుసుకొని ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొనే విధంగా కొత్త వెబ్‌సైట్ పోర్టల్ అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కల్పన అధికారి భరద్వాజ్ తదితరులు ఉన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

పాఠశాలల్లో ర్యాంపులు ఏర్పాటు చేయాలి

ఒంగోలు(విద్య), జనవరి 11 : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ర్యాంపులు లేని పాఠశాలలకు వెంటనే ర్యాంపులను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి వీఎస్ సుబ్బారావు పాఠశాలల హెచ్‌ఎంలను ఆదేశించారు. పాఠశాల నిర్వహణ నిధులు లేదా నాడు - నేడు నిధులతో ఈ ర్యాంపులు, రెయిలింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాల వరండా, నేల తక్కువ ఎత్తులో ఉన్నా ఇటుకలు పేర్చి ప్లాస్టింగ్ చేసి రెయిలింగ్ పెట్టాలన్నారు. ఎన్నికల కోసం ఈ పాఠశాలల్లో వసతులన్నింటిని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డీఈవో ఆదేశించారు.

నేడు జరుగుమల్లిలో స్పందన

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 11 : మండల కేంద్రమైన జరుగుమల్లిలో శుక్రవారం మండల స్థాయిస్పందన నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ గురువారం తెలిపారు. జరుగుమల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూలులో జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులందరూ పాల్గొంటారన్నారు. ఆ మండలంలోని ప్రజలు ఈ స్పందన కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ దాడులు

ఒంగోలు (క్రైం)జనవరి11: విద్యుత్ శాఖ విజిలెన్స్ దాడులు నిర్వహించి రూ. 7.80 లక్షల అపరాధ రుసుం విధించినట్లు ఆశాఖ డీఈ జి.వినయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం ఒంగోలులోని వీఐపీ రోడ్డు, మంగమూరురోడ్డు, అంజయ్య రోడ్డు, బండ్లమిట్ట, లాయర్‌పేట,గాంధీరోడ్డు, ఏనుగు చెట్టు ప్రాంతం, శివాలయం, మున్సిపాల్ ఆఫీస్,రాజాపానగల్‌రోడ్డు గద్దలగుంట, రాజీవ్‌నగర్‌లలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 37 బృందాలతో 2,975 సర్వీసుల తనిఖీలు చేసి మాల్‌ప్రాక్టీస్‌క్రింద 10 కేసులు, అదనపు లోడు కింద 154 కేసులు నమోదు చేసి రూ.7.80 లక్షలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు ఆయన తెలిపారు

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 11 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను రెయిన్బో డెంటల్ హాస్పటల్ వైద్యుడు భగవాన్ స్థానిక సంఘం కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ భగవాన్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఉపయోగపడే విధంగా క్యాలెండర్‌ను ప్రచురించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్ రెడ్డి , వరకుమార్, కోశాధికారి విజయభాను, ప్రతినిధులు మసూద్ ఆలీ, ఎం.గురుదేవి, రమణారెడ్డి, కే పాండురంగారెడ్డి, డి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె విరమణ

ఒంగోలు(విద్య), జనవరి 11 : తమ సమస్యల పరిష్కారం కోసం గత నెల 20 నుంచి సమగ్ర శిక్ష జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్న ఉద్యోగులు గురువారం సమ్మె విరమించి విధుల్లో చేరారు. విజయవాడలో బుధవారం రాత్రి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఏఎస్పీ డి. శ్రీనివాసరావు తదితరులతో సమగ్ర శిక్ష జేఏసీ నాయకుల చర్చలు సఫలమయ్యాయి. దీంతోవారు గురువారం సమ్మె విరమించి విధుల్లో చేరారు. ఈమేరకు జేఏసీ జిల్లా అధ్యక్షుడు హరిబాబు ఆధ్వర్యంలో ఉద్యోగులు డీఈవో, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ వీఎస్ సుబ్బారావును కలిసి తాము విధుల్లో చేరుతున్నట్లు అయనకు రాతపూర్వకంగా వినతిపత్రం ఇచ్చారు. దీంతో సమ్మె విరమించిన ఉద్యోగులను వెంటనే విధుల్లో చేర్చుకోవాలని మండల విద్యాధికారులు, హెచ్‌ఎంలను డీఈవో ఆదేశించారు.


డీఈవోకు విధుల్లో చేరుతున్నట్లు వినతిపత్రం ఇస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

పేస్ విద్యార్థి ప్రతిభ

ఒంగోలు(విద్య), జనవరి 11 : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో మై భారత్, వికసిత్ భారత్ అనే అంశంపై నిర్వహించిన జిల్లా స్థాయి డిప్లమేషన్ పోటీలో పేస్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. పేస్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఐ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పి. సుస్మిత కిరణ్ తన ప్రతిభను చాటి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విజేత సుష్మితను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, ఏవో ఎం. రమణబాబు, ఎన్‌బీఏ కోఆర్డినేటర్ టి. రామచైతన్య, డీన్ ఆర్. వీరాజనేయులు అభినందించారు.

ఎన్నికల నిర్వహణకు నోడల్ అధికారుల నియామకం

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 11 : జిల్లాలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కోసం వివిధ విభాగాలకు నోడల్ అధికారులను నియమిస్తూ జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన 16 రకాల విభాగాలకు జిల్లా శాఖల అధికారులను నియమించారు.

ఎన్నికల విధుల్లోకి ఉపాధ్యాయులను స్వాగతిస్తున్నాం

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 11 : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల విధులలో ఉపాధ్యాయులను తీసుకొనే ప్రక్రియను స్వాగతిస్తున్నట్లు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కార్యదర్శి డాక్టర్ రమేష్ కుమార్, జాయింట్ సెక్రెటరీ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం ప్రతిరోజు క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE

■ ఒంగోలు కర్నూల్‌రోడ్ లింగారెడ్డి అపార్ట్‌మెంట్ రోడ్ 160 చ॥గ॥లో నూతనంగా నిర్మించిన పడమర ఫేసింగ్ 3 ఇండిపెండెంట్ (2BHK) ఇల్లులు అమ్మకమునకు కలవు. వెంటనే సంప్ర॥ SSS హోమ్స్ సంప్ర॥ సెల్: 9703998899, 7569476242
AJO-183520

WANTED

■ ఒంగోలులోని సుందరయ్య భవన్ రోడ్డు నందు గల విజయ షుగర్ హాస్పటల్ నందు పనిచేయుటకు (MBBS) లేడి డాక్టర్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్రదించగలరు: 8885646777
AJO-182

అమ్మబడును

■ నెల్లూరు జిల్లా, కందుకూరు బైపాస్ ప్రక్కన 60 గదులు. గది 20 వేలు, బైపాస్ ప్రక్కన పొలం కూడా అమ్మబడును. కొలారెడ్డి నగర్, రెవెన్యూ కాలనీల్లో 210,40 గదులు ఇంటిస్థలం అమ్మబడును. సంప్ర॥ 9704250705
AJO- 151142

SSC-GD ఉచిత శిక్షణ

■ 26,146 SSC-GD కానిస్టేబుల్స్ ఉద్యోగాలకు అప్లయి చేసిన, అర్హత గల వారికి 100% జాబ్ గ్యారెంటీ శిక్షణ. 23 సం॥రాల అనుభవం- గత ఫలితాలు గల సంస్థ. స్టార్ డిఫెన్స్ అకాడమి, నంద్యాల, సెల్: 87908 44959
AJL-155550

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

ఆంధ్రజ్యోతి

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, ఉద్యోగ, వ్యాపార, బహిరంగ ప్రకటనలు, అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి మరియు అన్నిరకాల ప్రకటనలు కొరకు సంప్ర॥

ఒంగోలు : 99854 11071, 97036 18694, 95053 05888	చీరాల : 99859 21376
	మార్కాపురం : 99859 21358
	కందుకూరు : 97036 18697
చీమకుర్తి : 96525 55752	కనిగిరి : 99854 11483
	గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావలసినవారు మరియు పేపరు పంపిణీ విషయంలో ఎటువంటి సమస్యలు ఉన్నా సంప్ర॥
Asst-Cir-Manager. 9985411484

గుంటూరు : సరస్వతిథియేటర్	బాపట్ల : విజయకృష్ణ
గుంటూరు : హరిహరమహల్	పిడుగురాళ్ల : జయలక్ష్మీ
గుంటూరు : నాజ్‌అప్సరథియేటర్	సత్తెనపల్లి : ఈశ్వరసాయి
గుంటూరు : వి.ప్లాటినో	మాచర్ల : వెంకటేశ్వర
గుంటూరు : ది సినిమాస్	వినుకొండ : సురేష్‌మహల్
గుంటూరు : జెఎల్ఇసినిమాస్	అద్దంకి : VNS
తెనాలి : మినిసంగమేశ్వర	టంగుటూరు : వెంకటేశ్వర
తెనాలి : పెమ్మసానిథియేటర్	చీమకుర్తి : కె3కెస్క్రీన్స్
ఒంగోలు : గోరంట్లసినిమాస్	
ఒంగోలు : రవిప్రియమహల్	
చీరాల : సురేష్‌మహల్	
నరసరావుపేట : లక్ష్మీనరసింహ	
చిలకలూరిపేట : విజయభాస్కర్	
మంగళగిరి : అన్నపూర్ణ	
రేపల్లె : రాజ్యలక్ష్మీ	
పొన్నూరు : శ్రీలక్ష్మీ	

రేపే విడుదల




ప్రజా పరిచయ వేదిక
వృత్తిలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని,
ప్రతి నిమిషం ప్రజాసేవకై పరితపిస్తూ.. ఎన్నో సందర్భాలలో పేద,
బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికై కృషి చేస్తూ...
శ్రీ దగ్గుమళ్ళ ప్రసాదరావు గారు IRS
(చిన్న బుజ్జి) గారు ప్రజలకు మరింత సేవ చేయాలనే దృఢ సంకల్పంతో,
ఎన్టీఆర్ గారి స్ఫూర్తి, శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి
ఆశయ సాధనకై మన ముందుకు వస్తున్న సందర్భముగా వారికి
ఇవే మా హృదయపూర్వక శుభాకాంక్షలు
అందరికీ
ఆత్మీయ ఆహ్వానము
ది. 13-01-2024
ఉదయం 10.00 గం.లకు
మన బాపట్లలోని
విలియం బూత్ జూనియర్ కళాశాల ప్రక్కన,
క్రిస్టియన్ భవన్
ఆవరణములో
దేవతోటి సుందరయ్య
టిడిపి రాష్ట్ర యస్.సి.సెల్ ప్రధాన కార్యదర్శి, చీరాల
దేవతోటి నాగరాజు
పర్చూరు నియోజకవర్గ టిడిపి యస్.సి.సెల్ ప్రధాన కార్యదర్శి
జంగం రాజశేఖరరావు
విశ్రాంత సి.ఇ.ఓ. సంతరావూరు
జంగం ప్రవీణ్
బాపట్ల పార్లమెంటు టిడిపి క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు
పెనుమాల డేవిడ్
బాపట్ల పార్లమెంటు టిడిపి యస్.సి.సెల్ అధికారప్రతినిధి
చుక్కా కోటయ్య
రేపల్లె నియోజకవర్గ టిడిపి యస్.సి.సెల్ అధ్యక్షులు
పల్లం సరోజనీ
టిడిపి బాపట్ల పార్లమెంటు మహిళా ప్రధాన కార్యదర్శి
కూచిపూడి ఝాన్సీరాణి
టిడిపి బాపట్ల పార్లమెంటు కార్యదర్శి
ఇట్లు :
బాపట్ల పార్లమెంట్ తెలుగుదేశంపార్టీ నాయకులు,
కార్యకర్తలు మరియు అభిమానులు

అంగన్‌వాడీల అలుపెరగని పోరాటం

- 31వ రోజూ కొనసాగిన దీక్షలు
- కార్యకర్తలకు సూపర్‌వైజర్ల నోటీసులు
- వెరవక సమ్మె కొనసాగింపు



మార్కాపురంలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 11: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె గురువారం 31వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద దీక్షా శిబిరంలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో పాల్గొంటున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల ఇళ్లకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వీఆర్‌వోలు వెళ్లి షోకాజ్ నోటీసులు అంటించారు.

గిద్దలూరు : నిర్వధిన దీక్షల్లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రభుత్వ తీరును నిరసిస్తూ, కళ్లకు నోటికి, చెవులకు చేతులు అడ్డం పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. 31వ రోజు సమ్మెలో భాగంగా స్థానిక సచివాలయం ఎదుట నిరసన కొనసాగింది. 'కళ్లుండి చూడలేని ప్రభుత్వం, నోరుండి మాట్లాడలేని ప్రభుత్వం, చెవులుండి వినలేని ప్రభుత్వం' అంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. సంక్రాంతి పండుగ కూడా రోడ్డుమీదే జరుపుకుంటామని నినదించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీవర్కర్స్ యూనియన్ ప్రతినిధులు స్వర్ణకుమారి, మున్నా, రహమత్‌బీ, విజయలక్ష్మి, సీఐటీయూ నాయకులు ఆవులయ్య పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : అంగన్‌వాడీలకు ప్రభుత్వం న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌టీసీ బస్టాండు వద్ద నెల రోజులుగా అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న సమ్మె గురు వారం కూడా కొనసాగింది. ఈ క్రమంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ నెలకు పైగా వీధుల్లో ఆందోళన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. పైగా చిరు ఉద్యోగులపై ఎస్మా చట్టం ప్రయోగించడం, బెదిరించడం అన్యాయమని ఆరోపించారు. తమను కొందరు ప్రజాప్రతినిధులు వ్యంగంగా మాట్లాడటం శోచనీయ మన్నారు. తమకు గ్రాట్యూటీ, బీమా సౌకర్యం ఏర్పాటు, 62 ఏళ్లకు ఉద్యోగ విరమణ వంటి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాలనాగయ్య, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రఫీ, నాయకులు ముంతాజ్‌బేగం, సుబ్బమ్మ, వెంకటలక్ష్మీ, వెంకటరత్నం, పద్మ, సుహాసిని, కోడి రాణి, కుమారి, పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : ఎర్రగొండపాలెంలో 31వ రోజు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న ధర్నా శిబిరాన్ని టీడీపీ అంగన్వాడీ కార్యకర్తల యూనియన్ అధ్యక్షురాలు ఉప్పలపాటి నాగేంద్రమ్మ, ప్రధాన కార్యదర్శి మెహరున్నీసా, ఎర్రగొండపాలెం టీడీపీ అధ్యక్షురాలు





మార్కాపురంలో నోటీసును ఇంటికి అంటిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త, వై.పాలెంలో మాట్లాడుతున్న నాగేంద్రమ్మ

రమణమ్మలు గురువారం సందర్శించి సంఘీభావం తెలిపారు. టీడీపీ అధికారం చేపట్టగానే అంగన్వాడీల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు. చంద్రబాబు దృష్టికి సమస్యను తీసుకెళ్లి, పనికి తగిన వేతనం మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు జి.మల్లేశ్వరి, పి.సుబాషిణి, నాగరాజకుమారి, రామ సుబ్బమ్మ, అరుణ, సునీత, తలపాటి సుబ్బమ్మ, సుజాత, విజయలక్ష్మి, రూత్‌మేరి, రామకుమారి, తిరుపాలమ్మ, పాల్గొన్నారు. మూడు మండలాల నుంచి 250 మందికి పైగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : నెల రోజులుగా సమ్మె నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు స్థానిక టీడీపీ నాయకులు గురువారం మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు చేశారు. టీడీపీ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ పార్టీ అధ్యక్షులు సయ్యద్ షాన్వావలి, షేక్ మగ్బుల్, ఉలాపు బాలచెన్నయ్య, షేక్ మహమ్మద్ జానీలు ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం ఆవరణలో భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ పెద్దబాషా, పోలేపల్లి కిశోర్, వేములపాటి చంటి, తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించే వరకు పోరాటం

పొదిలి : సమస్య పరిష్కరించే వరకు తమ పోరాటం జరుగుతుందని అంగన్‌వాడీ కార్యకర్తలు ఖరాకండీగా చెబుతున్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని గత నెలరోజులుగా చేస్తున్న నిరసనను ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని విమర్శించారు. సమ్మెకు పరిష్కారమార్గం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. తక్షణమే ఎస్మా జీవోను వెనక్కు తీసుకొని తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. కనీస వేతనం 26వేలు అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు.

44 మందిపై విద్యుత్ చౌర్యం కేసులు

గిద్దలూరు టౌన్, జనవరి 11 : విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 44 మందిపై విజిలెన్స్ అధికారులు కేసులు నమోదు చేశారు. గిద్దలూరు మండలంలోని ముండ్లపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా దాడులు చేశారు. 44 మందిపై కేసు నమోదు చేసి రూ.2,61,500 జరిమానాను విధించారు. ఇంటికి మీటరు ఉన్నప్పటికీ అనధికారికంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అనుమతికి మించి ఎక్కువ లోడు వినియోగిస్తున్న వినియోగదారులను గుర్తించి కేసులు నమోదు చేసినట్లు విద్యుత్ విజిలెన్స్ శ్రీనివాసులు తెలిపారు. విద్యుత్ ఏఈ కోటేశ్వరరావు, 30 మంది అధికారులు, 40 మంది సిబ్బంది ఏకకాలంలో దాడులు నిర్వహించారు.

సంక్రాంతికి కోడిపందేలు నిషేధం

కొమరోలు, జనవరి 11: మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి పర్వదినం సందర్భంగా సాంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘీక కార్యక్రమాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై సుబ్బరాజు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా కోడిపందాలు, పేకాట శిబిరాలు నిర్వహించడం వంటి కార్యాక్రమాలు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ప్రజలను హెచ్చరించారు. గతంలో వీటికి పాల్పడిన వారిపై బైండోవర్ కేసులను నమోదుచేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రశాంతతను దెబ్బతీసే ఏ కార్యాక్రమాలకు పాల్పడినా వారిపై చర్యలు తప్పవన్నారు. పండుగ జరిగే మూడు రోజులు అన్ని గ్రామాల్లో పోలీసు బందోబస్తును ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

తర్లుపాడు, జనవరి 11: సంక్రాంతి పర్వదినం సందర్భంగా మండలంలో కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని తర్లుపాడు ఎస్ఐ వేముల సుధాకర్ హెచ్చరించారు. సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు, జూదాలు నిర్వహిస్తుంటారని, జూదం అనే వ్యసనం ప్రజల జీవితాలను నాశనం చేస్తుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిని ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించేది లేదన్నారు. కోడి పందేలు, జూదం నిర్వాహకులపై బైండవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. పండగను సాంప్రదాయ పద్ధతిలో సంతోషాలతో ప్రజలందరూ జరుపుకోవాలని ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి ముత్తుముల పరామర్శ



రమేష్ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జనవరి 11 : రైలు ప్రమాదంలో మృతిచెందిన ఏబీఎంపాలేనికి చెందిన పందిటి రమేష్ మృతదేహానికి గురువారం టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి నివాళ్లు అర్పించారు. ప్రమాద ఘటన గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులైన సోదరుడు పందిటి రజనీబాబు, కుటుంబసభ్యులకు సంతాపం, సానుభూతి తెలిపారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయండి : ఎమ్మెల్యే



కార్యకర్తలతో మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

మార్కాపురం రూరల్ జనవరి 11: విజయవాడ నగరంలో ఏర్పాటు చేయనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని ప్రజలు తరలివెళ్లి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి కోరారు. పట్టణంలోని చెన్నకేశవనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నడిబొడ్డున 125 అడుగులతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ 19న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరుగుతుంద న్నారు. కార్యక్రమానికి పెద్దఎత్తున ప్రజలు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

పెద్ద దోర్నాల, జనవరి 11: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'ఆడుదాం ఆంధ్ర' పోటీల్లో భాగంగా గురువారం మండల స్థాయి ఆటలపోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ప్రధానంగా క్రికెట్, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు నియోజకవర్గ స్థాయిలో పాల్గొంటారని ఎంపీడీవో నాసర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీ రామానాయక్, ఎంపీడీవో సీనియర్ అసిస్టెంటు శ్రీనివాసులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు నీరు..!

- కంపుతో ఇబ్బంది పడుతున్న స్థానికులు
- తరచూ జరుగుతున్న ప్రమాదాలు



రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

గిద్దలూరుటౌన్, జనవరి 11 : మండలంలోని పొదల కొండపల్లి గ్రామంలో రోడ్లపై మురుగు నీరు వెళ్తుండడంతో తరచూ వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లలోంచి మురుగు నీరు రో డ్డుపై వదులుతుండడంతో రోడ్డుపై నీరు ఎక్కడపడితే అక్కడ నిలిచి ఉంటున్నది. మురుగు కంపుతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. బుధవారం మురుగు నీరుపై ద్విచక్ర వాహనంపై నుంచి ఇద్దరు మహిళలు, ఒక వ్యక్తి కిందపడిన సంఘటనలు జరిగాయి. ఇందుకు సంబంధించి గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా మురుగు నీరు కాలువలు నిర్మించాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు.

రానున్న ఎన్నికల్లో టీడీపీ ప్రభంజనాన్ని ఆపలేరు



మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

అర్ధవీడు (కంభం), జనవరి 11 : రాష్ట్రంలో త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ, జనసేనల ప్రభంజనం సృష్టిస్తాయని వాటి విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని గిద్దలూరు టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. గురువారం అర్ధవీడు మండలం నాగులవరం గ్రామంలో నిర్వహించిన టీడీపీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి తన నిరంకుశ పాలనతో రాష్ట్రంలో నియంతృత్వంలోని నెట్టారన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుండి దోచుకోవడ మే పనిగా పెట్టుకున్నాడన్నారు. వైసీపీ అవినీతి, దుర్మార్గ పాలనను తరిమి కొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మండ్లమూడి ఆంజనే యులు, ప్రధాన కార్యదర్శి కొనతం రంగారెడ్డి, క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జిలు, మండల టీడీపీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంభం : టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోని అంశాలతో ప్రజల వద్దకు వెళ్లి మమేకం కావాలని గిద్దలూరు టీడీపీ ఇన్‌చార్జ్ ము త్తుముల అశోక్‌రెడ్డి ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కం భం పట్టణంలోని టీడీ పీ కార్యాలయంలో క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌చార్జ్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాడితప్పిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని, ఇందులో ప్రతి ఒక్కరూ టీడీపీ కి మద్దతుగా నిలిచి కార్యకర్తలకు ఉత్సాహం నింపాలన్నారు. ప్రతి ఒక్కరిని కలిసి మిని మానిఫెస్టోలోని అంశాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, క్లస్ట ర్ ఇన్‌చార్జిలు, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, పార్లమెంటు నాయకులు, పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు కృషి చేయాలి : నారాయణరెడ్డి



కార్యకర్తలతో మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

పొదిలి, జనవరి 11 : టీడీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని మార్కాపురం టీడీపీ ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక 4, 10, 11, 12 వార్డుల్లో బూత్‌కమిటీ సభ్యులతో స్థానిక వార్డు నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం నారాయ ణరెడ్డి మాట్లాడుతూ పొదిలిలో మొదటి నుంచి టీడీపీకి పట్టు ఉందన్నారు. అయితే కొంత కాలంగా ఆ పట్టుకోల్పోతున్నామని అందుకు కారణాలు తెలియాలని వార్డుల్లో నాయకులను, కార్యకర్తలను ఆయన కోరారు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నేరుగా తనను కలవవచ్చన్నారు. అంతేకాకుండా చిన్నచిన్న సమస్యలు ఏమైనా ఉంటే సమన్వ పరుచుకొని పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఇప్పుడు రాష్ట్రం ఉన్న పరిస్థితులను సరిచేయడానికి చంద్రబాబునాయుడి అవసరం ఉందన్నారు. ఏపీకి, యువతకు వైసీపీ ప్రభుత్వంలో ఎలాంటి భరోసా లేదన్నారు. తల్లిలేని బిడ్డకంటే దారుణంగా ఏపి పరిస్థితి ఉందన్నారు. గత చంద్రబాబు పాలనకు వైసీపీ పాలనను బేరీజు వేసుకొని రానున్న ఎన్నికల్లో నాయకున్ని ఎన్నుకోవాలన్నారు. అధికారంలోకి రాకముందు జగన్ మాటలను ఇప్పుడు వ్యవహరిస్తున్న తీరును గుర్తించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఇప్పుడు అన్ని విషయాల్లో మాట తప్పి ప్రజలను మోసం చేశాడని విమర్శించారు. ఇదేమిటని ప్రశ్నిస్తే అక్రమంగా కేసులు పెట్టడం ఆనవా యితీ మారిందన్నారు. రాష్ట్రం సుపరిపాలన దిశగా పయనించాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు.

మిరపకు వైరస్ తెగుళ్లు



మిరప పైరును పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారి విష్ణుప్రియ

గిద్దలూరు, జనవరి 11 : మండలంలోని వెల్లంపల్లి గ్రామపరిధిలో సాగైన మిరప పైరును ఉద్యానవన శాఖాధికారిణి విష్ణుప్రియ పరిశీలించారు. మిరపకు తామర పురుగులు, వైరస్ తెగులు ఆశించినట్లు గుర్తించారు. తామర పురుగులు ఆశించడంతో ఆకు అడుగు భాగాన పురుగులు ఉండి రసం పీల్చుకోవడం వలన ముడుచుకుని పోతున్నాయన్నారు. అలాగే తెల్ల దోమల వలన వైరస్‌వ్యాప్తి చెందుతుందని రైతులకు వివరించారు. దీని నివారణకు ఎకరా పొలంలో 20 చొప్పున పసుపు, బులుగు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. వేపనూనె 5 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవడం వలన పురుగులను గుడ్ల దశలోనే నివారించవచ్చని పేర్కొన్నారు. ఎసిఫేట్ 1.5 గ్రాము స్పైనోసైడ్ 25 ఎంఎల్‌ను పిచికారి చేసుకోవాలని తెలిపారు. సూక్ష్మ పోషకాలను అందించడం కోసం ఫార్ములా-6 లీటరుకు 5 గ్రాములు కలిపి పిచికారి చేయాలని మిరప రైతులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది మహమ్మద్‌నూర్, రైతులు పాల్గొన్నారు.

8వ శతాబ్దం నాటి తెలుగుశాసనం లభ్యం



శాసనాన్ని పరిశీలిస్తున్న చరిత్ర పరిశోధకులు, బయటపడ్డ శాసనం

ఎర్రగొండపాలెం, జనవరి 11 : ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం రామచంద్రాపురం (బాపనపల్లి) అగ్రహారం పొలాల్లో 8, 9వ శతాబ్దం నాటి తెలుగు శాసనం బయట పడింది. దీనిని చరిత్ర పరిశోధకులు తురిమెళ్ల శ్రీనివాస ప్రసాద్ గుర్తించి చిత్రాలను ఆర్కియాలజి సర్వే ఆఫ్ ఇండియా డైరక్టరు కె మునిరత్నానికి పంపించాడు. ఆ శాసనంలో తెలిపిన వివరాల ప్రకారం.. మకర ధ్వజ అని బిరుదు కలిగిన త్రిపురాంతకభటడు అనే రాజు ఈ ప్రాంతాన్ని పరిపాలించినప్పుడు కైలాస భగవంతుడిగా కీర్తించబడిన శ్రీ ఉమరవేయిధీశ్వరునికి దండియమ్మ అనే మహిళ తన్నాస అను తరుభూమి, ఇంటిని బహుమతిగా ఇచ్చినట్లు ఈ శాసనంలో లిఖించారు. ఈ సమీపంలోని అయ్యంబొట్లపల్లి గ్రామంలో శ్రీ రామలింగేశ్వరస్వామి వారి గుడిలో ఇలాంటి అక్షరాలతో కూడిన శాసనం లభ్యమైంది. సమీప ప్రాంత గ్రామం గోళ్లవీడపిలో కూడ ఇదే రీతిలోని శాసనాల వల్ల ప్రాచీన కాలంలో అత్యంత ముఖ్యమైన ప్రాంతంగా గుర్తింపు పొందింది. ఈ శాసనం వెలుగులోకి రావడానికి మాదాల శేషయ్య, కే.శ్రీను, వెంకటనాయుడు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా పోటీల్లో అపస్మృతి

- కబడ్డీ ఆడుతున్న క్రీడాకారుడికి గాయం
- మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తరలింపు



చికిత్స పొందుతున్న కృష్ణారెడ్డి

ఎర్రగొండపాలెం, జనవరి 11 : ఎర్రగొండపాలెంలో జరుగుతున్న మండల స్థాయి 'ఆడుదాం ఆంధ్రా' పోటీల్లో అపశృతి చోటుచేసుకొంది. కబడ్డీ ఆడుతూ గంజివారిపల్లె గ్రామానికి చెందిన యాతం కృష్ణారెడ్డి అనే యువకుడి ఎడమకాలు తుంటి ఎముక విరిగింది. దీంతో రక్త గాయమైంది. మండల స్థాయిలో కబడ్డీ సెమీఫైనల్‌లో గురువారం మొగుళ్లపల్లి, గంజివారిపల్లె జట్లు పోటీపడ్డాయి. మొగుళ్లపల్లి కబడ్డీ జట్టు నుంచి కూతకు వచ్చిన యువకుడిని పట్టుకొనే క్రమంలో గంజివారిపల్లె జట్టు యువకుడు యాతం కృష్ణారెడ్డి ఎడమకాలికి గాయమై విరిగింది. దీంతో కిష్టారెడ్డిని మెరుగైన వైద్యకోసం నరసరావుపేటకు తరలించినట్లు ఎంపీడీవో నాగేశ్వరప్రసాదు తెలిపారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు

పొదిలి, జనవరి11 : పొదిలి డిపో పరిధిలోని కొండపి, బొద్దికూరపాడు, గంగవరం గ్రామాల్లో తిరుగుతున్న ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణీకులకు డీఎం సుందరరావు లాటరీ తీసి బహుమతులు అందజేశారు. అనంతరం డీఎం సుందరరావు మాట్లాడుతూ ఆయా మార్గాల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణీకుల టికెట్టు వెనుక ప్రయాణికుడి పేరు, చిరునామాతో పాటు ఫోన్ నెంబరు రాసి బాక్సులో వేయాలన్నారు. బాక్సులో ఉన్న టికెట్లను లాటరీ తీసి ఎంపికైన ప్రయాణీకులకు బహుమతులను అందజేస్తారు. గురువారం తీసిన లాటరీలో ఎంపికైన విజేతలు రజనీ, గోవిందమ్మ, శ్రీనివాసులకు బహుమతులు అందజేసి వారిని అభినందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ, ఎస్‌టీఐ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అవీ..ఇవీ..

రెండు గ్రామాల్లో ఓటర్లకు అవగాహన



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దారు కిరణ్, అధికారులు

త్రిపురాంతకం, జనవరి 11: మండలంలోని రెండు గ్రామాల్లో ఓటర్లకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలలో ఓటుహక్కు విలువ, ఓటు ప్రాధాన్యత, ఈవీఎంలు తదితర అంశాల పై అవగాహన కార్యక్రమాలను తహసీల్దారు వి.కిరణ్ ఆధ్వర్యంలో వెల్లంపల్లి, విశ్వనాథపురం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటువేసే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేశారు. ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కేటీ.మల్లిఖార్జుననాయక్, ఏఎస్ఐ భాస్కరరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

15న ధార్మిక సమావేశం

గిద్దలూరు, జనవరి 11 : పట్టణంలోని షాదీఖానా ఆవరణలో ఈ నెల 15న ఉదయం 9 గంటలకు ధార్మిక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీజే కన్వీనర్ షేక్ ఖదీర్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. జనాబ్ అబ్దుల్ రెహమాన్ సాహెబ్ గుంటూరు నుండి వచ్చి ముఖ్యఅతిథిగా పాల్గొని ధార్మిక కార్యక్రమాల గురించి వివరిస్తారని, ముస్లింలు హాజరుకావాలని పేర్కొన్నారు.

ధర్మకర్తల మండలికి దరఖాస్తు చేసుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 11: మార్కాపురంలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుల నూతన నియామకానికి ఆసక్తి ఉన్న హిందూ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఈవో జి.శ్రీనివాసులరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ గుంటూరు ఉపకమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం దేవదాయ ధర్మాదాయ శాఖ చట్టం 30-1987కు లోబడి ధర్మకర్తల మండలి సభ్యుల నియామకం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న హిందూ అభ్యర్థులు ప్రకటన వెలువడిన 20 రోజుల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఘనంగా వడ్డె ఓబన్న జయంతి



ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

గిద్దలూరు, జనవరి 11 : కండల వీరుడు వడ్డె ఓబన్న 217వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం ఆవరణలో వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నమ్మిన బంటుగా ఉండి బ్రిటీష్ పాలకులపై జరిగిన పోరాటాలలో ఓబన్న అందించిన సహాయాన్ని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కడప వంశీధర్‌రెడ్డి, తహసీల్దార్ సీతారామయ్య, యోగా గురువు నారాయణరెడ్డి, విశ్రాంత సైనికుల వడ్డెర సంఘం అధ్యక్షులు శ్రీనాథ్, దొనకొండ జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఓబయ్య, వివిధ సంఘాల ప్రతినిధులు రమణయ్య, రామయ్య, మల్లెబోయిన శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద నాగులవరంలో వికసిత భారత్ యాత్ర



లబ్ధిదారులకు భారత్ గ్యాస్ కనెక్షన్ అందిస్తున్న అధికారులు

మార్కాపురం రూరల్, జనవరి 11: మండలంలోని పెద్ద నాగులవరం గ్రామంలో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొ న్నారు. గ్రామంలో ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజునాథరెడ్డి, మండల విస్తరణాధికారి రామ్మోహన్‌రెడ్డి, ఎంఈవో రాందాస్‌నాయక్, వ్యవసాయశాఖ ఏడీఏ రమాదేవి, ఏఓ శ్రీనివాసులు, సర్పంచ్ ఓర్సు వీరబాబు, సచివాలయ సిబ్బంది వలంటీర్లు పాల్గొన్నారు.

పొదుపు గ్రూపుల లక్ష్యాలు నెరవేర్చుకోవాలి



మాట్లాడుతున్న లక్ష్య

మార్కాపురం వన్ టౌన్, జనవరి 11: పొదుపు సంఘాల గ్రూపులు పెట్టుకున్న లక్ష్యాలు నెరవేర్చుకొని ప్రభుత్వ పథకాలు ఉపయోగించుకోవాలని పొదుపు సంఘాల సంస్థాగత నిర్మాణాల నిపుణురాలు జి.లక్ష్య అన్నారు. స్థానిక పట్టణ మెప్మా కార్యాలయంలో పొదుపు సంఘాల ఆర్‌పీలకు ప్రభుత్వ పథకాలకు మెప్మా కార్యాకలాపాలపై గురువారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్య మాట్లాడుతూ సోషల్ మెబైలేజేషన్, లీడర్‌షిప్ చేంజ్, ఎస్‌హెచ్‌జీ, ఎస్ఎల్ఎఫ్ సమావేశాల గురించి వివరించారు. ప్రభుత్వ పథకాలపై అవ గాహన కల్పించి వాటిని వినియోగించుకోవాలన్నారు. సుస్థిర జీవనోపాధులు, మార్కెట్ కల్పన, బ్యాంక్ లింకేజీ, మహిళా మార్ట్, పట్టణ మహిళా ప్రగతి యూనిట్‌పై, ఆరోగ్యం, బలవర్ధక ఆహారాల గురించి వివరించారు. కార్యక్రమంలో న్యూట్రిషన్ కె.రాణి, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యలక్ష్మీ, సిటీమిషన్ మేనేజర్ ఎలిశాబాబు తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర కేసులకూ వైద్యం అందించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కంభం, జనవరి 11 : కంభం ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే అత్యవసర కేసులకు ఇక్కడే వైద్యం చేయాలని, గిద్దలూరు, మార్కాపురం, తదితర వైద్యశాలలకు పంపించడం సరైన పద్ధతి కాదని ఎమ్మెల్యే అన్నా. రాంబాబు సూచించారు. గురువారం సాయంత్రం కంభం ప్రభుత్వ వైద్యశాలలో జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో సూపరింటెండెంట్ శివనాయక్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఇప్పటికీ ప్రభుత్వ వైద్యశాలలంటే ప్రజల్లో చిన్నచూపు ఉందన్నారు. ప్రభుత్వం మాత్రం వైద్యశాలల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందన్నారు. కొంతమంది సిబ్బంది పని తీరుతో వైద్యశాలకు చెడ్డపేరు వస్తుందన్నారు. ప్రభుత్వ వైద్యశా లకు కేవలం పేదప్రజలే వస్తారని, అలాంటి వారిని కూడా మీరు పక్క వైద్యశాలలకు పంపించడం సరైన పద్ధతి కాదన్నారు. సమావేశంలో పాల్గొన్న కో-ఆప్షన్ సభ్యుడు సలీమ్, కంభం సర్పంచ్ బోడయ్య, డిష్ మున్నా మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో వైద్యశాలలో సిబ్బంది పని తీరు సక్రమంగా లేకపోవడంతో ఓపీల సంఖ్య తగ్గిందన్నారు. సిబ్బంది పని తీరు మార్చుకొని వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. దీనిపై సూపరింటెండెంట్ శివనాయక్ మాట్లాడుతూ వైద్యశాలకు వచ్చే అన్ని కేసులను పంపడం లేదని, అత్యవసర సర్వీసులను, ఈ వైద్యశాలలో అందించలేని కేసుల ను మాత్రమే రెఫర్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ, ఎంపీడీవో ప్రసాద్, గొంగటి చెన్నారెడ్డి, అభివృద్ధి కమిటీ సభ్యుడు సబ్బసాని సాంబశివారెడ్డి, వెంకటేశ్వర్లు, కంభం, హెచ్‌గూడెం సర్పంచులు పాల్గొన్నారు.

మిర్చి రైతుకు తెగుళ్ల పోటు

- అదుపు చేసేందుకు పడరాని పాట్లు
- దిగుబడి తగ్గుతుందని రైతుల ఆందోళన
- మందులు కొట్టలేక పొలాల్లో వదిలేస్తున్న మిర్చి

ముండ్లమూరు, జనవరి 11 : మండలంలో రైతులు సాగు చేసిన మిర్చి తోటలకు తెగుళ్లు సోకి విలవిలలాడిపోతున్నారు. తెగుళ్ల నుంచి తోటలను కాపాడుకొనేందుకు రైతులు వివిధ రకాల మందులు పిచికారి చేసినా ఏ మాత్రం అదుపులోకి రాక పోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది మిర్చి పంటకు ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఈ ఏడాది రెట్టింపు సాగు చేశారు. దాదాపు రబీ, ఖరీ్‌ఫలో కలిపి 4,400 ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశారు. ఎక్కువగా తేజా రకం విత్తనాన్ని ఎంచుకొని సాగు చేసిన రైతులకు తెగుళ్ల కొంప ముంచాయి. ప్రధానంగా ఆకు ముడత, నల్లి, జెమినీ వైరెస్ సోకాయి. తోటలు ఎదుగుదలకు వచ్చి పూత, పింద దశలో ఉన్న తోటలతో పాటు మొదటి కోత దశలో సైతం విపరీతమైన తెగుళ్ల సోకాయి. ఆ తెగుళ్ల నుంచి మిర్చి సాగు రైతు బయట పడేందుకు వివిధ రకాల మందులు పిచికారి చేసినా కూడా అదుపులోకి రావడం లేదు. కొంత మంది రైతులు ఐతే ఎన్ని మందులు కొట్టినా తెగుళ్ల కంట్రోల్‌కి రాక పోవడం తో తోటలు వదిలి వేశారు. మరి కొంత మంది రైతులైతే పుట్టిన కాడి కల్లా అప్పులు తీసుకు వచ్చి పిచికారీ చేస్తున్నారు. ఇప్పటికే ఎకరానికి స రాసరి రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు పెట్టుబడులు పె ట్టారు. తీరా దిగుబడి చూసే సరికి తెగుళ్ల వల్ల గణనీయంగా తగ్గుముఖం పడుతుందేమోనని భయాందోళన చెందుతున్నారు. పుట్టిన కాడి కల్లా అప్పులు తీసుకు వచ్చి పెట్టుబడులు పెట్టారు. దిగుబడులు చూస్తే మొదటి కోతకు వచ్చిన దిగుబడి చూసి ఆందోళన చెందుతున్నారు. మండలంలో ప్రధానంగా ఉమా మహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, నాయుడుపాలెం, తమ్మలూరు, పసుపుగల్లు, వేములబండ, జమ్మలమడక, శంకరాపురం, సుంకరవారిపాలెం, నూజెండ్లపల్లి, ముండ్లమూరు, పులిపాడు, వేంపాడు, పోలవరం గ్రామాల్లో ఎక్కువ మంది రైతులు మిర్చి తోటలను సాగు చేశారు. గత వారం పది రోజుల నుంచి ముమ్మరంగా మిర్చి కోస్తున్నారు. ఎక్కువగా నల్ల నల్లి, బొబ్బర, జెమినీ వైరెస్ సోకిన తోటలు మా త్రం దిగుబడి పూర్తిగా పడిపోయింది. లేత తోటలు మాత్రం ఎక్కువగా నల్లి తెగులు చుట్టివే సింది. వ్యవసాయ శాఖ అధికారులు అడపాదడపా తోటల ను సం దర్శించి రైతులకు సూ చనలు ఇస్తున్నా కూడా ఏ మాత్రం అదుపులోకి రాలేదు. దీంతో ఈ ఏడాది మిర్చి సాగు చేసిన రైతుల పరిస్థితి కొంత ఇబ్బందికరంగా మారింది.



తమ్మలూరులో మిరప తోటకు సోకిన బొబ్బర తెగులు



వేములబండలో నల్లి తెగులు సోకడంతో వదిలేసిన మిరప తోట

కొంప ముంచాయి



ఈ ఏడాది ఐదు ఎకరాల్లో మిర్చి తో టను సాగు చేశాను. ఎకరానికి రూ 1.50 లక్షల వరకు పెట్టుబడులు పెట్టాను. తీరా పూత, పిందె దశలో వచ్చే సరికి నల్లి తెగులు, బొబ్బర తెగులు సోకాయి. దీంతో మిరప చెట్టు అంతా వడబడి పోయింది. దీంతో పూత, పిందె పూర్తిగా రాలి పో యాయి. పంట కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థంకావడంలేదు.

- కాసా అంజిరెడ్డి, మిర్చి సాగు రైతు, తమ్మలూరు

తోట చూస్తే బాధగా ఉంది



ఈ ఏడాది నాలుగు ఎకరాల్లో మిర్చి తోట సాగు చేశాను. తేజా రకాన్ని ఎంచు కోవటం జరిగింది. ఐతే ఇప్పటికే ఎకరానికి లక్ష రూపాయల నుంచి రెండు లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. ఇంకా మొదటి కోత కోయ కుండానే తోటంతా తెగులు సోకింది. పెట్టుబడి ఎలా తీర్చాలో అర్థం కావటం లేదు.

- సాధు ఆదిరెడ్డి, మిర్చి సాగు రైతు, ఉమా మహేశ్వర అగ్రహారం



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రకాశం

ఎంపీపీని ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి

రాష్ట్రంలో పాలనే లేదు.. ఇక్కడ పనులెలా జరుగుతాయి..!

- సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వంపై ఎంపీపీ అసంతృప్తి
- సమావేశానికి 12 శాఖల అధికారుల గైర్హాజర్‌పై ఆగ్రహం
- మంచినీరు, రేషన్ సరఫరాపై సభ్యుల ధ్వజం

కనిగిరి, జనవరి 11 : రాష్ట్రంలోనే పాలనే లేదు.. ఇక ఇక్కడెలా పనులు జరుగుతాయంటూ ఓ సభ్యుడు అభివృద్ధిపై ప్రశ్నించడంతో ఎంపీపీ ప్రభుత్వంపై తన అసంతృప్తిని మండల సర్వసభ్య సమావేశంలో వెల్లగక్కారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ దంతులూరి ప్రకాశం అధ్యక్షతన గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఇది చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చీర్లదిన్నె ఎంపీటీసీ సభ్యుడు అట్లా రామచంద్రారెడ్డి పౌరసరఫరాల శాఖ అధికారులు గైర్హాజరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతినెలా రేషన్ పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయన్నారు. అసలు రేషన్ పంపిణీలో ఏఏ వస్తువులు ప్రభుత్వం ద్వారా వస్తున్నాయో కూడా తెలియని పరిస్థితి నెలకొందన్నారు. కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేసి ఎండీయూ ఆపరేటర్లు చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. నెలనెలా వచ్చే సరుకుల జాబితా తెలియ చేయాలని ఎంపీపీని కోరారు. రేషన్ పంపిణీ సరఫరా అజానుపాలవుతోందన్నారు. అదేవిధంగా గ్రామాల్లో మంచినీటి సరఫరా సక్రమంగా జరుగడం లేదన్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సమస్యలపై అధికారుల వద్ద ప్రస్తావించి పరిష్కారం చేసుకుందామంటే అసలు ప్రభుత్వ శాఖల అధికారులే సమావేశానికి రాకపోవడం పట్ల ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గ్రామాల్లో తమను ప్రజలు నిలదీస్తున్నారని వారికి ఎవరు సమాధానం చెప్పాలని ఎంపీపీని ప్రశ్నించారు. ఈ సమయంలో ఎంపీపీ తటపటాయిస్తూ అసలు రాష్ట్రంలోనే పాలన లేదు. ఇక ఇక్కడెలా పనులు జరుగుతాయన్నారు. అధికారులు లెక్క కూడా చేయడం లేదని, ఎన్నికలు దగ్గర పడుతున్నాయి ఇప్పుడేంటి చేసేదని ఎంపీపీ ప్రకాశం పెదవి విరిచారు. సమావేశంలో అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులు పాల్గొని ఆయా శాఖల ద్వారా జరుగుతున్న పనులను వివరించారు. మొక్కుబడిగా సాగిన ఈ సమావేశానికి 12 శాఖలైన డ్వామా, విద్యుత్, ఆర్అండ్‌బీ, మత్స్యశాఖ, పశుసంవర్ధక, ఇరిగేషన్, పౌరసరఫరా, హౌసింగ్, అటవీ, ఎక్సైజ్, దేవదాయ, మైనింగ్ శాఖల అధికారులు హాజరుకాలేదు. వీరిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీపీ తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో మల్లికార్జునరావు, సింగిల్‌విండో చైర్మన్ సంగు సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీలు లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, ధనుంజయ, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రలో క్రికెటర్ల వాకౌట్

- వేర్వేరు నిర్ణయాలను వెల్లడించిన అంపైర్లు
- ఆ నిర్ణయాన్ని ప్రశ్నించిన క్రీడాకారులు
- ఆడితే ఆడండి లేకపోతే వెళ్లిపోండన్న అంపైర్ ?

పీసీపల్లి, జనవరి 11 : ఆడుదాం ఆంధ్ర పేరుతో వైసీపీ నిర్వహిస్తున్న క్రీడలు వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతున్నాయి. క్రీడల నిర్వహణలో అంపైర్లుగా వ్యవహరిస్తున్న కొందరి వ్యవహార శైలితో క్రీడాకారులు ఆట ఆడకుండా మధ్యలోనే వాకౌట్ చేసి వెళ్లిపోతున్నారు. గురువారం పీసీపల్లిలో మండల స్థాయిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీల్లో అంపైర్ నిర్ణయంతో క్రికెట్ జట్టు సభ్యులు ఆట మధ్యలోనే వాకౌట్ చేసి వెళ్లిపోయారు. వాకౌట్ చేసిన క్రికెట్ క్రీడాకారులు తెలిపిన వివరాల మేరకు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ముద్దపాడు, పెదఅలవలపాడు జట్ల మధ్య క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. తొలుత బ్యాటింగ్ చేసిన ముద్దపాడు జట్టు నిర్ణీత 10ఓవర్లలో 67పరుగులు చేసింది. 68 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన పెద అలవలపాడు జట్టు 2 ఓవర్‌లు పూర్తయ్యే సరికి 12 పరుగులు చేసింది. 3వ ఓవర్‌లో బౌలర్ వేసిన తొలి బంతి కీపర్ చేతిలోకి వెళ్లింది. బౌలర్, కీపర్ ఔట్ అంటూ అప్పీల్ చేశారు. లెగ్ అంపైర్ నాటౌట్‌గా ప్రకటించారు. అంతలోనే ఫీల్డర్లందరూ మెయిన్ అంపైర్‌కు పదేపదే అప్పీల్ చేయగా బ్యాట్స్‌మెన్ ఔట్ అయినట్లు అంపైర్ ప్రకటించారు. దీంతో బ్యాట్స్‌మెన్‌కు అంపైర్‌కు మధ్య వాదన జరిగింది. ఈ క్రమంలో అంపైర్ నిర్ణయమే ఫైనల్ అని, ఆడితే ఆడండి లేకపోతే వెళ్లిపోండి అంటూ అంపైర్ అనడంతో పెదఅలవలపాడు క్రికెట్ జట్టు సభ్యులు ఆటను మధ్యలోనే నిలిపివేసి వాకౌట్ చేసి వెళ్లిపోయారు.దీంతో ముద్దపాడు జట్టును విజేతగా అంపైర్ ప్రకటించారు. కాగా ఇరుజట్ల క్రీడాకారులకు సర్దిచెప్పి ఓవర్లు ముగిసే వరకు ఆటను ఆడించాల్సిన అంపైర్లు వారి వారి విరుద్ధ నిర్ణయాలతో ఆట మధ్యలోనే వాకౌట్ చేసి రావడం బాధాకరంగా ఉందని క్రీడాకారులు తెలిపారు.

అంపైర్ వివరణ

ఆడుదాం ఆంధ్రలో పెదఅలవలపాడు క్రికెట్ జట్టు సభ్యులు వాకౌట్ చేసిన విషయమై అంపైర్ నరేష్‌ను వివరణ కోరగా బౌలర్ వేసిన బంతి బ్యాట్‌కు తగిలి కీపర్ చేతిలోకి వెళ్లింది. దీంతో ఔట్‌గా ప్రకటించా. బ్యాట్స్‌మెన్ నా నిర్ణయాన్ని వ్యతిరేకించాడు. ఆ క్రమంలో ఔట్ అయిన బ్యాట్స్‌మెన్‌ను క్రీజ్‌ను వదిలి వెళ్లమన్నాను తప్ప ఆడితే ఆడండి లేకపోతే వెళ్లిపోండి అని నేను అనలేదు అని చెప్పారు.

18న సాయిబాబా ఆలయంలో మహాయజ్ఞం

పామూరు, జనవరి 11 : సాయిబాబా దేవస్థానంలో ఈనెల తేదీ 18న గురువారం శ్రీ గురురాం రతన్‌జీ బాబా ఆశీస్సులతో (దత్తకారుణ్య ట్రస్ట్) అఖండజ్యోతి ప్రజ్వలనతో సాయినాథుని సచ్చరిత్ర పారాయణం సప్తసప్తాహ (49) రోజులు మహా యజ్ఞమును శ్రీ సిద్ధయోగిని గురు మాతాజీ ప్రారంభిస్తారని దేవస్థాన కమిటీ చైర్మన్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానంలో మహాయజ్ఞంకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. 7 రోజులు సాగే అఖండ జ్యోతి కార్యక్రమాన్ని భక్తులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి దరిశి నరసింహారావు, కోశాధికారి తిరుపతయ్య, భక్తులు పాల్గొన్నారు.

గుంటూరు	:సరస్వతిథియేటర్	బాపట్ల	:విజయకృష్ణ
గుంటూరు	:హరిహరమహల్	పిడుగురాళ్ళ	:జయలక్ష్మి
గుంటూరు	:నాజ్‌అప్సరథియేటర్	సత్తెనపల్లి	:ఈశ్వరసాయి
గుంటూరు	:వి.ప్లాటినో	మాచర్ల	:వెంకటేశ్వర
గుంటూరు	:ది సినిమాస్	వినుకొండ	:సురేష్‌మహల్
గుంటూరు	:జెవిఎల్ఇసినిమాస్	అద్దంకి	:VNS
		టంగుటూరు	:వెంకటేశ్వర
తెనాలి	:మినిసంగమేశ్వర	చీమకుర్తి	:కె3కెస్క్రీన్స్
తెనాలి	:పెమ్మసానిథియేటర్		
ఒంగోలు	:గోరంట్లసినిమాస్		
ఒంగోలు	:రవిప్రియమహల్		
చీరాల	:సురేష్‌మహల్		
నరసరావుపేట	:లక్ష్మీనరసింహ		
చిలకలూరిపేట	:విజయభాస్కర్		
మంగళగిరి	:అన్నపూర్ణ		
రేపల్లె	:రాజ్యలక్ష్మి		
పొన్నూరు	:శ్రీలక్ష్మి		

రేపే విడుదల



ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ — ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

HOUSE FOR SALE

■ ఒంగోలు కర్నూలురోడ్ లింగారెడ్డి అపార్ట్‌మెంట్ రోడ్ 160 చ॥గ॥లో నూతనంగా నిర్మించిన పడమర ఫేసింగ్ 3 ఇండిపెండెంట్ (2BHK) ఇల్లులు అమ్మకమునకు కలవు. వెంటనే సంప్ర॥ SSS హోమ్స్ సంప్ర॥ సెల్: 9703998899, 7569476242
AJO-183520

WANTED

■ ఒంగోలులోని సుందరయ్య భవన్ రోడ్డు నందు గల విజయ షుగర్ హాస్పటల్ నందు పనిచేయుటకు (MBBS) లేడి డాక్టర్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్రదించగలరు: 8885646777
AJO-182

అమ్మబడును

■ నెల్లూరు జిల్లా, కందుకూరు బైపాస్ ప్రక్కన 80 గదులు. గది 20 వేలు, బైపాస్ ప్రక్కన పొలం కూడా అమ్మబడును. కొలారెడ్డి నగర్, రెవెన్యూ కాలనీలో 210,40 గదుల ఇంటిస్థలం అమ్మబడును. సంప్ర॥ 9704250705
AJO- 151142

SSC-GD ఉచిత శిక్షణ

■ 26,146 SSC-GD కానిస్టేబుల్స్ ఉద్యోగాలకు అప్లయి చేసిన, అర్హత గల వారికి 100% జాబ్ గ్యారెంటి శిక్షణ. 23 సం॥రాల అనుభవం- గత ఫలితాలు గల సంస్థ. స్టార్ డిఫెన్స్ అకాడమి, నంద్యాల, సెల్: 87908 44959
AJL-155550

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌తో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, ఉద్యోగ, వ్యాపార, బహిరంగ ప్రకటనలు, అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి మరియు అన్నిరకాల ప్రకటనలు కొరకు సంప్ర॥

ఒంగోలు : 99854 11071, 97036 18694, 95053 05888
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావలసినవారు మరియు పేపరు పంపిణీ విషయంలో ఎటువంటి సమస్యలు ఉన్నా సంప్ర॥
Asst-Cir-Manager. 9985411484

అంగన్‌వాడీలపై నిర్లక్ష్యం తగదు

- సమ్మెకు జనసేన సంఘీభావం
- ఒంటికాలిపై నిల్చొని నిరసన



అంగన్‌వాడీలకు మద్దతుగా మాట్లాడుతున్న జనసేన పార్టీ నాయకుడు రహీముల్లా

కనిగిరి, జనవరి 11 : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు మాతృత్వాన్ని పంచుతూ విశిష్ట సేవలందిస్తున్న అంగన్‌వాడీ వర్కర్‌లు, హెల్పర్‌లపై వైసీపీ నిర్లక్ష్యం తగదని జనసేన నాయకులు రహీముల్లా అన్నారు. ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతుగా గురువారం జనసేన కార్యకర్తలు, నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పాల్గొన్న రహీముల్లా మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సరైన సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పౌష్టికాహార పంపిణీ సక్రమంగా లేకపోవడంతో రక్తహీనతను ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రాలను బలవంతంగా స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం సచివాలయ సిబ్బందితో విధులు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. వారికి ఏ మాత్రం అవగాహన లేని విధులు కల్పించడం వలన అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇబ్బందిగా మారిందన్నారు. కేంద్రంలో ప్రతి రోజు వర్కర్‌లు ఎత్తు, బరువు, ఏ పౌష్టికాహార లోపం ఉందో గమనించి వారికి అవసరమైన మేరకు ఆహారాన్ని వివిధ రూపాల్లో అందిస్తారన్నారు. కానీ నేడు ఆ పరిస్థితిని వైసీపీ లేకుండా చేసిందన్నారు. జనసేన, టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక అంగన్‌వాడీల సమస్యలపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఇండ్ల రమేష్, అంజినాయుడు, అనిల్‌కుమార్, ప్రేమ్‌కుమార్, ఖాజా, ఇమ్రాన్, మల్లికార్జున్, దేవా, వంశీ, ప్రసాద్, చంటి, అక్బర్ పాల్గొన్నారు.

వనూత్న నిరసనలు

న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పీసీ కేశవరావు ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలు చేస్తున్న 31వ రోజు సమ్మెలో భాగంగా ప్రభుత్వ తీరును నిరసిస్తూ అంగన్‌వాడీలు ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు పీ క్రాంతి, బీ జయప్రద, నాయకు లు రాజ్యలక్ష్మి, రాజేశ్వరి, రజని, సీత, సుజాత, భాగ్యలక్ష్మీ, రామసుబ్బులు, సౌందర్య పాల్గొన్నారు.

దర్శి : డిమాండ్ల సాధన కోసం చేస్తున్న ఆందోళనల్లో బాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు 31వ రోజు గురువారం పట్టణంలో నిరసన ర్యాలీ చేశారు. గడియార స్తంభం సెం టర్‌లో రాస్తారోకో చేసి వాహనాలను నిలిపి వే శారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సం ఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా కార్యకర్తలకు నోటీసులు ఇవ్వటం దారుణమన్నారు. ప్రభుత్వ ఆ దేశాలతో అధికారులు బెదిరింపు చర్యలకు పా ల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిమాండ్లు పరిష్కరించకుంటే భవిష్యత్‌లో మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు బాలమ్మ, తిరుతపమ్మ ప్రశాంతి, నాగమణి, రంగమ్మ, ఫాతిమా, వెంకటరమణ, విశ్వవాణి, సుబ్బమ్మ పాల్గొన్నారు.

ముగిసిన ఎడ్ల బల ప్రదర్శన పోటీలు



బండ లాగుతున్న ఎడ్లు

దర్శి జనవరి 11 : బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు, వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు గురువారం ముగిశాయి. మాజీ ఎమ్మెల్యే డా క్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో బుధవారం జరిగిన పోటీల్లో 18 జతల న్యూ కేటగిరీ ఎడ్లు పోటీల్లో పాల్గొనగా, గురువారం సీనియర్ క్యాటగిరీ ఎడ్లు 16 జతలు పోటీల్లో పాల్గొన్నాయి. శాప్ కార్పొరేషన్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన సీనియర్ కేటగిరీ ఎడ్లకు ప్రథమ బహుమతిగా రూ.2లక్షలు, న్యూ కేటగిరీలో ప్రథమ బహుమతిగా రూ.లక్ష నగదును అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే జంకె, మాజీ ఎంపీపీలు కోటయ్య, ఇత్తడి దేవదానం, ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకటరెడ్డి, సద్ది పుల్లారెడ్డి పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పుతో ఎస్సీ రైతుల భూములకు రక్షణ

తాళ్లూరు, జనవరి 11 : ప్రభుత్వం అందజేసిన డీకే పట్టా భూమిలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్న అగ్రవర్ణాల నుంచి రక్షణ కల్పించాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్ ఆధ్వర్యంలో పోలీసులు రక్షణ కల్పించే చర్యలు చేపట్టారు. డీఎస్పీ గురువారం దారంవారిపాలెంను సందర్శించి హైకోర్టును ఆశ్రయించి ఉత్తర్వులు పొందిన భూ యజమాని నూకతోటి గోవిందమ్మ, కుటుంబీకులతో మాట్లాడారు. ప్రభుత్వం దారంవారిపాలెం గ్రామానికి చెందిన సర్వే నెంబర్ 102/1లో2 ఎకరాల 50సెంట్ల భూమికి డీకే పట్టా ఇచ్చింది. సదరు భూమిని 2020లో తూరకపాలెం గ్రామానికి చెందిన కుమ్మిత శివారెడ్డి దున్నుతుండగా తమ భూమిలో ఎందుకు దున్నుతున్నారని గోవిందమ్మ, కుటుంబీకులు ప్రశ్నించగా శివారెడ్డి, భార్య విజయ వారిని కులంపేరుతో దూషించారు. ఈమేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదయింది. తమకున్న హక్కుల మేరకు గోవిందమ్మ కుటుంబీకులు పొలం దున్నేందుకు వెళుతుండా శివారెడ్డి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. దీంతో గోవిందమ్మ తన భూమిలోకి వెళ్లకుండా అగ్రవర్ణాలు అడ్డుకుంటున్నారని హైకోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం గోవిందమ్మకు ఆ భూమి విషయంలో పూర్తి హక్కులు ఉన్నందున ఆ భూమిలోకి వెళ్లేందుకు భూహక్కుదారులు అడ్డుకోండా చూడాలని, భూమిని సాగు చేసుకునేందుకు పోలీస్ శాఖ వారికి రక్షణ కల్పించాలని ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టుఉత్తర్వుల మేరకు డీఎస్పీ అశోక్‌వర్ధన్ పొలం వద్దకు వెళ్లి గోవిందమ్మ, కుటుంబీకులతో మాట్లాడారు. పొలంను సాగు చేసుకోవాలని, ఎవరైనా అడ్డు వస్తే తమకు చెపితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ ఎస్‌వీ రమణయ్య ఉన్నారు.

రేపటి నుంచి ఎన్టీఆర్ కబడ్డీ టోర్నమెంట్

దొనకొండ, జనవరి 11 : దొనకొండ ఒబ్బాపురం యూత్ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ నుంచి ఎన్టీఆర్ మండల స్థాయి కబడ్డీ టోర్నమెంట్ ఆర్పీఎం పాఠశాల గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు రాజేష్, భాను, లక్ష్మణ్ తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.5వేలు, రెండవ రూ.4,116, మూడవ బహుమతిగా రూ.3116 అందజేస్తామని చెప్పారు. ఎంట్రీ ఫీజు రూ.200 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.



కస్తూరిరెడ్డిని ప్రశ్నిస్తున్న రాజ్యలక్ష్మి

జడ్పీటీసీ సభ్యునికి నిరసన సెగ

- వైసీపీ తీరును తూర్పారబట్టిన అంగన్‌వాడీలు
- కారులో ఉడాయించిన కస్తూరిరెడ్డి

కనిగిరి, జనవరి 11 : అంగన్‌వాడీల నిరసన సెగతో కనిగిరి జడ్పీటీసీ సభ్యుడు మడతల కస్తూరిరెడ్డి ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ ఘటన గురువారం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే 30 రోజులుగా అంగన్‌వాడీ వర్కర్‌లు, హెల్పర్‌లు సమస్యలను పరిష్కరించాలంటూ వివిధ రూపాల్లో నిరసన తెలియచేస్తూ సమ్మె నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కస్తూరిరెడ్డి నిరసన శిబిరం సమీపంలోని వ్యవసాయశాఖ కార్యాలయం వద్దకు వచ్చారు. ఈ క్రమంలో ఆయనను చూసిన అంగన్‌వాడీలు నిరసన స్వరం పెంచుతూ వైసీపీ ప్రభుత్వ తీరుపై నినాదాలు చేశారు. దీంతో జడ్పీటీసీ సభ్యుడు కస్తూరిరెడ్డి అంగన్‌వాడీల వద్దకు వచ్చి ప్రభుత్వం మీకు న్యాయం చేసేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే మీకు వేతనాలు పెంచారని, కరోనా కారణంగా అభివృద్ధి, పాలన కుంటుపడిందన్నారు. యూనియన్ నాయకులతో సంప్రదింపులు జరిపి న్యాయం చేస్తామని ఆయన సర్దిచెప్పబోయారు. దీంతో అంగన్‌వాడీ కనిగిరి సెక్టార్ నాయకులు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీలపై వైసీపీ అనుసరిస్తున్న తీరును తూర్పారబట్టారు. జడ్పీటీసీతో వాదనకు దిగి ప్రశ్నలవర్షం కురిపించారు. తెలంగాణ కంటే జీతాలు పెంచుతామని, మినీ అంగన్‌వాడీలను అప్‌గ్రేడ్ చేస్తామని, మినీ సెంటర్‌ల వర్కర్‌లకు ఉద్యోగోన్నతి కల్పిస్తామని జగన్‌రెడ్డి ఓట్లు కోసం అబద్ధపు హామీలు ఇచ్చారని నిలదీశారు. దీంతో ఆయన సర్దిచెప్పే ప్రయత్నం చేయగా అందరూ నిరసన తెలపడంతో ఆయన కారెక్కి ఉడాయించారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక పరీక్ష

దొనకొండ, జనవరి 11 : కే రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్ నర్సరావుపేట వారి ఆధ్వర్యంలో స్థానిక గౌతమి డిగ్రీ కాలేజీలో గురువారం నిర్వహించిన మెరిట్ స్కాలర్‌షిప్ ఎంపిక పరీక్షకు 147 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల అడ్మిన్ ఎఫ్రాయిమ్ (నాని) తెలిపారు. మూడవ తరగతి నుంచి ఏడవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష రాసే విధానంను విద్యార్థులకు వివరించి 90 నిమిషాలు పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి ప్రథమ బహుమతిగా రూ.15వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10వేలు, తృతీయ బహుమతిగా రూ.5వేలు నగదును ఈనెల 17న కే రెడ్డి పాఠశాలలో భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అందజేస్తారని నాని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోపి, వైస్ ప్రిన్సిపాల్ రామయోగి, అధ్యాపకులు దేవదానం పాల్గొన్నారు.

ఉద్యోగ ప్రకటన

ఇది వరకు ఈనాడు దినపత్రికలో 14.10.2023న ఇచ్చిన ఉద్యోగ ప్రకటన అనుసరించి జిల్లా విద్యాశాఖాధికారి ఒంగోలు వారి ఉత్తర్వులు Rc No. 4192/C2/2023 Date 28.12.2023 మరియు రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ గుంటూరు వారి ఫైల్ నెంబర్ ESE02/1135/2023-B-SEC-RJD GNT Dated 10.1.2024.

సెయింట్ పాల్స్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ కమిటీ
CC No.1428/2014 Pending in the Honourable High Court of AP.
The Govt. Memo No. ES01/139/2021/PS Dated 14.9.2023
(క్రిస్టియన్ మైనారిటీ విద్యా సంస్థలు) గిద్దలూరు, ప్రకాశం జిల్లా.

వారి ఆధ్వర్యంలో నడుపబడుచున్న ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాలలో ఏర్పడియున్న ఎయిడెడ్ ఖాళీ పోస్టులను ప్రభుత్వ నిబంధనల మేరకు భర్తీ చేయుటకు ప్రభుత్వం అనుమతించియున్నారు. కనుక అర్హతగల అభ్యర్థుల నుండి ధరఖాస్తులు కోరుచున్నాము.

ఖాళీల వివరములు

Name of the School	Name of the Post	No of Posts	Roster Points
1. St. Pauls Aided Ele School OV Palli Racharla	SGT	01	1/100 OC
	SGT	01	2/100 SC
(2) St. Pauls Aided Ele School Ganesh Nagar Giddalur	SGT	01	3/100 OC
	SGT	01	4/100 BCA
3. St. Palls Aided Ele School Railway Colony	SGT	01	5/100 OC
	SGT	01	6/100 OC
Total		06	

Name of the School	Name of the Post	No of Posts	Roster Points
1. Aided School OV Palli Racharla	BEd Science (BS) Assistant	01	1/100 OC
	Grade 1 Telugu Pandit	01	1/100 OC
	Grade 1 Hindi Pandit	01	1/100 OC
(2) Aided High School Railway Colony Giddalur Prakasam Dt	BEd Maths Assistant	01	1/100 OC
	School Assistant (Humanities (Social) Studies	01	1/100 OC
	Grade 1 Telugu Pandit	01	2/100 SC
	P.ET Teachers	01	1/100 OC
3. St. Palls Aided High School SC Colony Gidalur	Grade II Telugu Pandit	01	1/100 OC
Total		08	

ఎంపిక విధానము: 1. డిపార్ట్‌మెంట్ నామినిచే ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేయుదురు. 2. క్రిస్టియన్ మైనారిటీ వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. 3. వయోపరిమితి: ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఎంపిక చేయబడును. 4. ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్హతలు కలిగి ఉండాలి. 5. టెట్ ఎగ్జామినేషన్‌కు హాజరైన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడును.

దరఖాస్తు చేసికొనవలసిన తేది: 11.1.2024 నుండి చివరి తేది. 25.1.2024 సా॥ 5గం॥ లోపు చేరవలెను. తదుపరివచ్చు అప్లికేషన్స్ స్వీకరించబడవు.

దరఖాస్తులు పంపుకోవలసిన చిరునామా: సెక్రటరి & కరస్పాండెంట్, సెయింట్‌పాల్స్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ కమిటీ, గిద్దలూరు (గ్రా&పో), ప్రకాశం జిల్లా, ఆం.ప్ర. పిన్ 523 357

అభ్యర్థులు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపవలెను. (పోస్టల్ డిలేకు మేము బాధ్యులము కావు)

Note: Subject to Out come of W.P. No 5 of 2023 pending before The Honourable High Court of Andhra Pradesh


ప్రజా పరిచయ వేదిక
వృత్తిలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని,
ప్రతి నిమిషం ప్రజాసేవకై పరితపిస్తూ.. ఎన్నో సందర్భాలలో పేద,
బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికై కృషి చేస్తూ...
శ్రీ దగ్గుమళ్ళ ప్రసాదరావు గారు IRS
(చిన్న బుజ్జి) గారు ప్రజలకు మరింత సేవ చేయాలనే దృఢ సంకల్పంతో,
ఎన్టీఆర్ గారి స్ఫూర్తి, శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి
ఆశయ సాధనకై మన ముందుకు వస్తున్న సందర్భముగా వారికి
ఇవే మా హృదయపూర్వక శుభాకాంక్షలు
అందరికీ
ఆత్మీయ ఆహ్వానము
ది. 13-01-2024
ఉదయం 10.00 గం.లకు
మన బాపట్లలోని
విలియం బూత్ జూనియర్ కళాశాల ప్రక్కన,
క్రిస్టియన్ భవన్
ఆవరణములో
దేవతోటి సుందరయ్య
టిడిపి రాష్ట్ర యస్.సి.సెల్ ప్రధాన కార్యదర్శి, చీరాల
దేవతోటి నాగరాజు
పర్చూరు నియోజకవర్గ టిడిపి యస్.సి.సెల్ ప్రధాన కార్యదర్శి
జంగం రాజశేఖరరావు
విశ్రాంత సి.ఇ.ఓ. సంతరావూరు
జంగం ప్రవీణ్
బాపట్ల పార్లమెంటు టిడిపి క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు
పెనుమాల డేవిడ్
బాపట్ల పార్లమెంటు టిడిపి యస్.సి.సెల్ అధికారప్రతినిధి
చుక్కా కోటయ్య
రేపల్లె నియోజకవర్గ టిడిపి యస్.సి.సెల్ అధ్యక్షులు
పల్లం సరోజనీ
టిడిపి బాపట్ల పార్లమెంటు మహిళా ప్రధాన కార్యదర్శి
కూచిపూడి ఝాన్సీరాణి
టిడిపి బాపట్ల పార్లమెంటు కార్యదర్శి
ఇట్లు :
బాపట్ల పార్లమెంట్ తెలుగుదేశంపార్టీ నాయకులు,
కార్యకర్తలు మరియు అభిమానులు


నీటిలో నానుతున్న శనగ పైరు (ఫైల్)

పరిహారం.. ఎప్పటికో?

- మిచౌంగ్‌తో మునిగిన రైతులు
- 4.26 లక్షల ఎకరాల్లో పంట నష్టం
- నష్టంపై ప్రభుత్వానికి వెళ్లిన నివేదికలు
- రోజులు గడుస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం

మిచౌంగ్ ముంచి రోజులు గడుస్తున్నా.. రైతులకు పరిహారంపై ప్రభుత్వం మౌనం వీడటంలేదు. తుఫాన్ కారణంగా చేతికందే దశలోని, కొత దశలోని పంటలు పూర్తిగా వర్షార్పణమయ్యాయి. రోజుల తరబడి పంట చేలు వర్షపు నీటిలోనే ఉండటంతో రైతులు నిండా మునిగిపోయారు. ఇటు జిల్లా అధికారులు.. అటు కేంద్ర బృందం పంట నష్టం అంచనాలపై పర్యటించి ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఆలస్యంగా అయినా పంట నష్ట పరిహారం అందుతుందని ఆశించిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వ తీరుతో నిరాశకు గురవుతున్నారు. నెల రోజులు అవుతున్నా ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం ఊసే లేకపోవడంపై బాధిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 4.26 లక్షల ఎకరాల్లో పంట నష్టం వివరాలు ప్రభుత్వానికి వెళ్లి రోజులు గడుస్తున్నా పరిహారం కోసం రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు.


నీటిలో మునిగివున్న వరి చేను (ఫైల్)

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
రైతుల రెక్కల కష్టం మిచౌంగ్ తుఫాన్ తుడిచిపెట్టేయగా.. పాలకులు పరిహారం గురించి పట్టించుకోకుండా రైతులను పరిహసిస్తున్నారు. తుఫాన్ ఆనవాళ్లు చెదిరిపోయినా నష్ట పరిహారం ప్రభుత్వం నుంచి అందలేదని రైతులు వాపోతున్నారు. ఇంటికి చేరాల్సిన పంటలను వర్షం ముంచేయగా.. ప్రభుత్వం పరిహారం అందజేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. భారీ వర్షాలు, పెనుగాలులు చుట్టేయడంతో రైతులు నిండా మునిగిపోయినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు మిచౌంగ్ తుఫాను తీవ్ర నష్టం కలిగించింది. రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. మిచౌంగ్ తుఫాన్ పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలకు తీవ్ర నష్టం కలిగించింది. ముఖ్యంగా వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావమే చూపింది. చెరువులను తలపించేలా పొలాలు మునిగిపోయాయి. వరి, పత్తి, శనగ, మొక్కజొన్న, మినుము, పొగాకు తదితర పంటలకు అపార నష్టాన్ని కలిగించాయి. మిరప, అరటి, బొప్పాయి, పండ్లు, పూల తోటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టాలను నమోదు చేశారు. ప్రాథమిక అంచనాల అనంతరం పూర్తి వివరాలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇన్‌పుట్ సబ్సిడీకి వ్యవసాయ, ఉద్యాన శాఖలు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాయి. కేంద్ర బృందం పరిశీలన పూర్తై రోజులు గడుస్తున్నది. అయితే ఇంత వరకు రైతులకు పంట నష్ట పరిహారం గురించి ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. పరిహారం ఎప్పుడు వస్తుందా అని రైతులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని కోరుతున్నారు. భారీ వర్షాలు రైతులను కోలుకోలేకుండా దెబ్బతీస్తే ఆదుకోవాల్సిన ప్రభుత్వం కూడా పట్టీపట్టనట్టుగా వ్యవహరిస్తుండం తమను దగా చేయడమేనని రైతులు వాపోతున్నారు.


మిర్చిపైరులో నిలిచిన నీరు (ఫైల్)

బాపట్ల జిల్లాలో..

సముద్ర తీర ప్రాంతానికి సమీపంలో ఉన్న బాపట్ల జిల్లాను మిచౌంగ్ తుఫాన్ వణికించింది. జిల్లా పరిధిలో పంటలకు అపార నష్టం వాటిల్లింది. 2.68 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిని రైతులు దారుణంగా నష్టపోయారు. వరి పంటకు భారీగా నష్టం వాటిల్లింది. వరి 1.97 లక్షల ఎకరాలు, శనగ 29,750 ఎకరాలు, మినుము 3,605 ఎకరాలు, పొగాకు 14,472 ఎకరాలు, మొక్కజొన్న 9,172 ఎకరాల్లో నష్టం జరిగినట్లు అధికారులు లెక్కలు కట్టారు. ఉద్యాన పంటలకు 14,030 ఎకరాల్లో నష్టం వాటిల్లగా ఇందులో మిర్చి 10,315 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు తేల్చారు.

గుంటూరు జిల్లాలో ..

మిచౌంగ్ తుఫాన్ కారణంగా గుంటూరు జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. జిల్లాలో పంటలకు భారీ నష్టం వాటిల్లింది. 1,21,400 ఎకరాల్లో పంటలు దెబ్బతినడంతో రైతులు కోలుకోలేని విధంగా నష్టపోయారు. ప్రధానంగా వరి పంటకు ఎక్కువగా నష్టం జరిగింది. వరి 93,850 ఎకరాల్లో దెబ్బతిన్నది. పత్తి 2,550 ఎకరాలు, మినుము 4,397 ఎకరాలు, శనగ 16,930, పొగాకు 2,430 ఎకరాలు, వెయ్యి ఎకరాల్లో జొన్న, 243 ఎకరాల్లో మొక్కజొన్న, 16,507 ఎకరాల్లో మిరప, 1,497 ఎకరాల్లో అరటి, 1,225 ఎకరాల్లో పూలు, కూరగాయలు, తమలపాకు తోటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు పంపారు.


పొగాకు చేలో నీరు (ఫైల్)

పల్నాడు జిల్లాలో..

పల్నాడు జిల్లాలో 36,725 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. 2,356 ఎకరాల్లో మిరప పంటకు నష్టం వాటిల్లింది. 10,605 ఎకరాల్లో శనగదెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ నిర్ధారించింది. 9,859 మంది రైతులను బాధితులుగా గుర్తించారు. పంట నెలరోజుల వ్యవధిలోనే దెబ్బతినడంతో ఇన్‌పుట్ సబ్సిడీ పరిధిలోకి రాదని వ్యవసాయ శాఖ వెల్లడించింది. నెల రోజుల వ్యవధి పంటకు ఎకరానికి కనీసం రూ.10 వేలు రైతులు ఖర్చు చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఎకరాకు రూ.15 వేల వరకు ఖర్చయినట్లు బాధిత రైతులు తెలిపారు. అయినా శనగ పంటకు ఒక్క రూపాయి కూడా పరిహారం అందే పరిస్థితి లేదు. శనగ సాగు చేసుకునేందుకు విత్తనాన్ని 80 శాతం సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేస్తూ చేతులు దులుపుకోవడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. పరిహారం చెల్లించాలని కోరుతున్నా మొర ఆలకించే పాలకులే కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంది 1357 ఎకరాల్లో, పొగాకు 1543 ఎకరాల్లో, మొక్కజొన్న 600 ఎకరాల్లో, వరి 2,610 ఎకరాల్లో దెబ్బతిన్నాయి.

రాజకీయ వేడి

- 22న వైసీపీ బస్సు యాత్ర
- 29న బాబు 'రా కదలిరా' సభ
- భారీగా ఏర్పాట్లు చేస్తున్న పార్టీ నాయకులు
- చీరాల నియోజకవర్గంలో ఊపందుకున్న సమీకరణలు



చీరాల, జనవరి 11: వైసీపీ బస్సుయాత్ర.. టీడీపీ రా కదలిరా సభలతో చీరాల నియోజకవర్గంలో రాజకీయం ఊపందుకుంది. ఈ నెల 22న వైసీపీ సాధికార బస్సుయాత్ర, 29న టీడీపీ అధినేత చంద్రబాబు రా కదలిరా సభలకు ఆయా పార్టీల నాయకులు బారీగా సన్నాహాలు చేస్తున్నారు. వైసీపీ బస్సుయాత్ర తొలి షెడ్యూల్‌లోనే చీరాల నియోజకవర్గం ఉంది. అయితే, ఆపార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ బస్సుయాత్ర ఖరారైన తర్వాత రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. దీంతో ఆ షెడ్యూల్‌ను వాయిదా వేశారు. ప్రస్తుతం వెంకటేష్ కోలుకున్నారు. ఈ నేపథ్యంలో 22న జరగనున్న వైసీపీ బస్సు యాత్రలో వెంకటేష్ పాల్గొనేందుకు పూర్తిస్థాయిలో కార్యాచరణకు ఆపార్టీ వర్గీయులు అడుగులు వేస్తున్నారు. వేటపాలెంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే బలరాం మాట్లాడుతూ వెంకటేష్ ఆరోగ్య పరిస్థితిని వివరిస్తూ, వచ్చే ఎన్నికల్లో చీరాల నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా వెంకటేష్ పోటీ చేస్తారని, అందులో ఎలాంటి సందేహాలకు తావులేదని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు సభ నేపథ్యంలో స్థానిక వైసీపీ నేతల్లో నెలకొన్న అంతర్గత కుమ్ములాటలపై ఆ పార్టీశ్రేణులతో పాటు, ఇతర రాజకీయ వర్గాల్లోను చర్చ సాగుతోంది. ఈ నెల 29న చీరాలలో 'రా కదలిరా' సభలో చంద్రబాబు పాల్గొననున్నారు. అంతకుముందు ఓ సందర్భంలో చీరాల పర్యటన వర్షం కారణంగా రద్దయింది. ఇటీవల తుఫాన్ కారణంగా నష్టపోయిన పంటలను పరిశీలించేందుకు చంద్రబాబు జిల్లాలో పర్యటించినప్పటికి చీరాల నియోజకవర్గానికి రాలేకపోయారు. ఈ నేపథ్యంలో ఈనెల 29వ తేదీ చంద్రబాబు 'రా కదలిరా' సభపై టీడీపీ, జనసేనలో కదలిక మొదలైంది. నియోజకవర్గంలో పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎంఎం కొండయ్య ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. తొలుత అధికారపార్టీ నుంచి ఆటుపోట్లు ఎదురయ్యాయి. పలు సవాళ్లు ఎదుర్కొన్నారు. వాటిని అధిగమిస్తూ తనదైన శైలిలో శ్రేణులను కూడగట్టుకుంటూ ముందుకు సాగుతూ వస్తున్నారు. ఇటీవల పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. ఈక్రమంలో కేడర్‌కు స్పష్టమైన సంకేతాలు ఇవ్వాల్సిన అవసరం అధినాయకులపై ఉందని పార్టీశ్రేణులతో పాటు సానుభూతిపరులు కూడా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.


ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ విజయవాడలో గురువారం నిర్వహించిన ముగ్గుల పోటీలో అద్దేపల్లి సునీత(సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల) ఉమ్మడి గుంటూరు జిల్లా తరపున పాల్గొని రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించింది.

ఇసుక ఇష్టారాజ్యం

ఇసుక.. అధికార పార్టీ నేతలకు కాసులు కురిపిస్తోంది. ఇష్టారీతిన తవ్వుతూ.. తరలిస్తూ కాసులు పోగేసుకుంటున్నారు. అధికారిక రీచ్‌లతో పాటు అనధికార రీచ్‌ల్లోనూ యథేచ్ఛగా తవ్వకాలు చేస్తున్నారు. నిబంధనలు పట్టిం చుకోవడంలేదు. కళ్లెదుటే ఇసుక దోపిడీ జరుగుతున్నా మామూళ్ల మత్తులో అధికారులు మునిగిపోయారు. బిల్లులతో పని లేకుండా ఒకే బిల్లుపై పలుమార్లు ఇసుక తరలిపోతున్నా.. పట్టించుకునేవారు లేరు. ప్రభుత్వం వారంవారం పత్రికల్లో ధరను నిర్ణయిస్తూ ప్రకటిస్తున్నా.. వసూలు చేసే ధరకు పొంతనే ఉండటంలేదు. ప్రకాశం బ్యారేజి దిగువున అడ్డులేకుండా ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. అధికారిక రీచ్‌లలో ఒక లారీ ఇసుకకు బిల్లు తీసుకుని, ఆ తర్వాత రోజంతా అదే బిల్లుపై దొంగ రీచ్‌లలో పట్టపగలే లెక్కలేనన్ని ట్రిప్పులు తరలిస్తున్నారు. పర్యవేక్షించే అధికారే లేకపోవడంతో ఇష్టారాజ్య మైపోయింది. ఇప్పుడిప్పుడే నిర్మాణ రంగం పుంజు కొంటుండటంతో ఇసుకకు డిమాండ్ పెరిగింది. దీనిని ఆసరగా చేసుకొని సప్లయర్లు దోచుకుంటున్నారు. మైనింగ్ అధికారులు ప్రేక్షక పాత్రకు పరి మితం అవుతున్నారు. కనీసం జిల్లా యంత్రాం గమైనా అక్రమ ఇసుకపై చర్యలు తీసుకోక పోతుండటంపై విమర్శలు చెలరేగుతున్నాయి.



- అడ్డేలేకుండా తవ్వకం.. అమ్మకం
- ప్రభుత్వ ధరకు రెట్టింపు వసూలు
- ఒక బిల్లుతో కావాల్సినన్ని ట్రిప్పులు
- బుసక రీచ్‌ల్లోనూ ఇసుక తవ్వకాలు
- అధికారిక రీచ్‌లు మూడే.. అనధికారం లెక్కేలేదు
- మామూళ్ల మత్తులో మునిగి పట్టించుకోని అధికారులు

తెనాలి, గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎక్కడ చూసినా దొంగ ఇసుక... స్థానిక నేతల కనుసన్నల్లో ఒకప్పుడు గుట్టుగా సాగిన ఇసుక రవాణా ఇప్పుడు బహిరంగంగానే సాగిపోతోంది. ఉమ్మడి గుంటూరు పరిధి నుంచి వస్తున్న ఇసుక లారీలను కృష్ణా జిల్లాకు చెందిన రీచ్‌ల నిర్వాహకు లు పట్టుకుంటున్నారు. అంటే ఇక్కడ తవ్వి.. తరలిస్తున్నా ఇక్కడి అధికారులు కళ్లుమూసుకున్నట్లుగా అర్థమవుతుంది. బిల్లుతో పనిలేకుండా దొంగతనంగా తరలించడంతో ప్రభుత్వ నిర్ణయ ధరను మించి పెద్దగా పెంచకుండా అమ్మే స్తుంటే, వినియోగదారునికి మేలు జరుగుతున్నా, ప్రభుత్వ ఆదాయానికి మాత్రం గండిపడుతోంది. గతంలో ఉన్న జేపీ సంస్థ తప్పుకున్నాక, ప్రస్తుతం ఇసుక రీచ్‌లలో బిల్లులు జీసీకేసీ ప్రాజెక్ట్ అండ్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే పేరుతో ఇస్తున్నారు. ఈ కంపెనీ ప్రవేశించాక దుగ్గిరాల మండలం పెదకొండూరు, కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం, బాపట్ల జిల్లా కొల్లూరు మండలం గాజుల్లంకలో కొత్త రీచ్‌లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇవికాక జగనన్న కాలనీల కోసం బుసక రీచ్‌ల కింద అన్నవరం, వల్లభాపురం దగ్గర అనుమతులిచ్చారని సమాచారం. అయితే ఇవి కాకుం డా అనధికారికంగా ఇసుక తవ్వకానికి అవకాశం ఉన్న ప్రతి రీచ్‌లోనూ తవ్వేస్తున్నారు. అయినా అధికారులు మాత్రం పట్టించుకుంటున్న పరిస్థితిలేదు. పది చక్రాల లారీ లోడు పరిమితి కేవలం 18 టన్నులు మాత్రమే ఉంటే, ఏకంగా 25 టన్నులని బిల్లుపైనే రాసిస్తున్నా, రవాణా, మైనింగ్ అధికారులు పట్టించుకుంటున్న దాఖలాలే లేవు. ప్రకాశం బ్యారేజి దిగువున కొల్లిపర, మున్నంగి, బొమ్మువానిపాలెం, అన్నవరం, బాపట్ల జిల్లాలోని చిలుమూరు, ఈపూరు, పెసర్లంక, గాజుల్లంక, జువ్వలపాలెం రీచ్‌లలో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు జరిగిపోతున్నాయి. సోమవారం రాత్రి అన్నవరపులంక దగ్గర్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్న రెండు లారీలను కొత్త కంపెనీ సిబ్బంది పట్టుకుని కొల్లిపర పోలీసులకు అప్పగించారనేది సమాచారం. అయితే దీనిపై కేసు నమోదు చేశామని చెబుతున్నా, లారీలు మాత్రం యథేచ్ఛగా బయటే తిరుగుతున్నాయని కొల్లిపరలోని అధికార పార్టీ నాయకులే చెప్పడం విశేషం. నదిలో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అధికారికంగా అనుమతి ఇవ్వడంతో జీసీకేసీ సంస్థ పేరుతో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. అయితే ఇక్కడ ఒక బిల్లు రాయించుకుని అదే బిల్లుపై ఇతర చోట్ల ఇసుక పోసుకుని తరలిస్తున్నారు. పది చక్రాల లారీలో కేవలం 18 టన్నుల పరిమాణం వరకు మాత్రమే ఇసుక తరలించేందుకు అనుమతి ఉంటే, అధికారికంగా రీచ్‌లు తెరచిన సంస్థ బిల్లులపైనే ఏకంగా 25 టన్నుల వరకు ఇసుక పోస్తున్నట్లు రాసేసి డబ్బు వసూలు చేయడం విశేషం. ఇది కాగితాలపైనే కనిపిస్తున్నా రవాణా శాఖ కానీ, సెబ్ కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. బిల్లుపై 25 టన్నులని రాసి 40 నుంచి 45 టన్నుల వరకు ఇసుక పోసేసి మిగిలిన పరిమాణానికి కంపెనీనే అనధికారిక దోపిడీకి తెరతీస్తోంది. ఇంతటి ఘరానా దోపిడీ ప్రత్యక్షంగా కనిపిస్తున్నా అంతా గప్‌చుప్ అన్నట్లు అధికారులు వ్యవహరించటం విశేషం.



జీసీకేసీ సంస్థ పేరుతో కొల్లిపర మండలంలో ఇస్తున్న బిల్లులు, 25 టన్నులు పోస్తున్నట్లు ఉన్న బిల్లు

దొంగ ఇసుకతో భారీగా లబ్ధి

ప్రకాశం బ్యారేజి దిగువున అధికారిక రీచ్‌లలో టన్ను ఇసుక రూ.475కు అమ్మాలని ప్రభుత్వం ధర నిర్ణయించింది. ఉదాహరణకు కొల్లిపర దగ్గర టన్ను ఇసుక రూ.475 ధర ఉంటే, తెనాలికి కిరాయి, ఇతర ఖర్చులు కలిపితే టన్ను రూ.650 వరకు పలుకుతుంది. జేపీ సంస్థ ఉన్న సమయంలోనే బిల్లుపై తీసుకొచ్చిన ఇసుకను తెనాలి పట్టణం, చుట్టుపక్కల ప్రాంతాల్లో టన్ను రూ.750 నుంచి రూ.900 వరకు అమ్మారు. కానీ ఇప్పుడు టన్ను కేవలం రూ.550 నుంచి రూ.600 వరకే పలుకుతుంది. ఇది కొంతవరకు వినియోగదారులకు మేలు జరిగే అంశమే. అయితే వీరికి జరిగే మేలు రూ.50 నుంచి రూ.100 వరకే అయితే దొంగతనంగా ఇసుక తీసుకొచ్చి అమ్ముతున్నవారు మాత్రం రూ.వేలల్లో లబ్ధి పొందుతూ ప్రభుత్వ ఆదాయానికి భారీగానే గండికొడుతున్నారు. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాల్సిన సెబ్, పోలీస్, మైనింగ్ శాఖలోని విజిలెన్స్ అధికారులు కొన్నిచోట్ల నేతల సిఫార్సులు, మరికొన్నిచోట్ల మామూళ్ల మత్తుతో పట్టించుకోవడంలేదు.

బుసక పేరు చెప్పి తరలింపు..

జగనన్న కాలనీలకు మెరకలు, పునాదుల నుంచి లెంటల్ లెవల్ లోపు గదుల్లో నింపేందుకు బుసక కావాలని అధికార పార్టీ నేతల అనుచరులు అనుమతులు తీసుకున్నారు. అయితే బుసక పేరుచెప్పి ఇసుక తరలిస్తున్నారు. కొల్లిపర మండలం అన్నవరం, బొమ్మువానిపాలెం రీచ్‌లలో బుసకకు అనుమతులిస్తే, మున్నంగి, వల్లబాపురం దగ్గర కూడా తవ్వకాలు చేస్తున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. పగలు బుసక తవ్వుతున్నా, రాత్రి మాత్రం ఇసుక తరలిస్తున్నారు. బొమ్మువానిపాలెం వంటి రీచ్‌ల దగ్గర బుసక అనుమతులున్నా, ఇక్కడే ఇసుక రీచ్‌కు కూడా అనుమతి ఉండటంతో పగలు కూడా అడ్డులేకుండా తరలిస్తున్నారని అధికారిక రీచ్‌ల నిర్వాహకులే చెబుతున్నారు. ఉదాహరణకు బొమ్మువానిపాలెం రీచ్‌కు అనుమతి ఉంటే, ఆ రీచ్‌లో ఒక ట్రిప్‌కు బిల్లు తీసుకుని తర్వాత ట్రిప్పులు ఆ రోజులో ఎన్ని అవ కాశం ఉంటే అన్నిటిని పక్కనున్న అన్నవరం, బొమ్మబానిపాలెం బుసక రీచ్‌లలో, మున్నంగి, కొల్లిపర, వల్లభాపురం రీచ్‌లలో తవ్వుకుపోయి అమ్మేసుకుంటున్నారు. ఈ కారణంగా ప్రభుత్వానికి, అటు ఇసుక అనుమతులు దక్కించుకున్న సంస్థ ఆదాయానికి గండిపడుతోంది. మరోపక్క అధికారిక రీచ్‌లో ఒక లోడ్ 25 టన్నులకు రూ.11,875 చెల్లించి తర్వాత ట్రిప్పులకు అదే బిల్లుపై ఆ రీచ్‌లోనే రూ.7,500 నుంచి రూ.9 వేల వరకు చెల్లిం చి అనధికారికంగా ఇసుక తరలిస్తున్నారు.

గుంటూరులో 5 టన్నులు రూ. 5,800

ఇసుక ధరలను సప్లయర్లు మళ్లీ పెంచేశారు. ఇటీవల ఇసుక ధర తగ్గించినట్లే తగ్గించి ఒక్కసారిగా రెట్టింపు చేయడంపై భవన నిర్మాణదారులు, సొంత ఇల్లు నిర్మించుకుంటున్న సామాన్యులు తీవ్ర ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు మున్నంగి, వల్లభాపురం రీచ్‌లను కేటాయించారు. అక్కడ టన్ను రూ.475గా ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా పాయింట్ల నుంచి గుంటూరు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఈ దృష్ట్యా టన్నుకు రూ.196 రవాణా చార్జీలను నిర్ణయించారు. మొత్తంగా టన్ను ఇసుక ధర రూ.671 దాటడానికి వీల్లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనిని పరిగణనలోకి తీసుకుంటే 5 టన్నుల ట్రాక్టర్ ఇసుక రూ.3,355కి సరఫరా చేయాలి. అయితే సప్లయర్లు ఏకంగా రూ.5,800 డిమాండ్ చేస్తున్నారు. అదే 11 టన్నుల 6 టైర్ల లారీకి రూ.9,500 వసూలు చేస్తున్నారు. 10 టైర్ల లారీకి 27 నుంచి 28 టన్నులు వస్తుందని, టన్ను రూ.800 చొప్పున లెక్కించి రూ.22 వేలు చెల్లించాల్సిందిగా కోరుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలతో పోల్చితే ట్రాక్టరు, 6 టైర్ల లారీకి దాదాపుగా రెట్టింపు చార్జీలు వసూలు చేస్తున్నారు. 10 టైర్ల లారీ విష యానికి వస్తే 35 టన్నులకు పైగా లోడిం గ్ చేసి తీసుకొచ్చి అందులో ఆరు, ఏడు టన్నుల ఇసుకని ట్రాక్టర్లలో అన్‌లోడింగ్ చేసి మిగతా 27 టన్నులు రూ.800 చొప్పున టన్నుకు రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నారు.

ఇసుక వాహనాలు సీజ్ చేయొద్దని అనధికార ఆదేశాలు

జిల్లా వ్యాప్తంగా ఇసుక తరలించే ట్రాక్టర్లు, లారీలను ఎక్కడా సీజ్ చేయొద్దని ప్రభుత్వ పెద్దల నుంచి మైనింగ్, పోలీసు, విజిలెన్స్ తదితర శాఖలకు ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం. అలానే రవాణా శాఖకు కూడా ఈ విషయంలో నిర్దిష్టమైన ఆదేశాలు ఉండటంతో ఓవర్ లోడింగ్ జరు గుతున్నా మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్లు ఎలాంటి కేసులు నమోదు చేయడం లేదు.



కళాకారులకు ప్రాణంపోస్తున్న కళాపరిషత్‌లు

- సినీ నటుడు రఘుబాబు
- అనంతవరంలో నాటికల పోటీలు ప్రారంభం



సినీ నటుడు రఘుబాబును సత్కరిస్తున్న ఈదర హరిబాబుతో కళాపరిషత్ సభ్యులు



కొత్త పరిమళం నాటికలోని ఓ సన్నివేశం

యద్దనపూడి(మార్టూరు), జనవరి 11: గ్రామీణ ప్రాంతాలలో కళాపోషకులు నిర్వహించే కళాపరిషత్‌లు రంగస్థల కళాకారులకు ప్రాణం పోస్తాయని సినీ నటుడు రఘుబాబు అన్నారు. యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామంలో గురువారం రాత్రి ఎన్టీఆర్ కళాపరిషత్ నాటికల పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలను ఒంగోలు మాజీ ఎమ్మెల్యే, ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభా వేదికపై కందిమళ్ల సాంబశివరావు అతిథులను ఆహ్వానించగా, కళాపరిషత్ అధ్యక్షుడు గుదే పాండు రంగారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా నాటకరంగ పరిశోధకులు మన్నె శ్రీనివాసరావు విచ్చేశారు. నన్నాన గ్రహీత సినీ నటుడు రఘుబాబు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా కళాకారులకు నిలయమన్నారు. అంతకుముందు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు కార్యక్రమంలో గుదే తారక రామారావు, కొరటాల వంశీ , తదితరులు పాల్గొన్నారు.

తొలి ప్రదర్శనగా శ్రీకాకుళం జిల్లా శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం వారు కొత్త పరిమళం ప్రదర్శించారు. మనుషులలో మానవత్వం దాగి ఉంటుందని, మానవత్వం బయటపెడితే అందమైన ప్రపంచాన్ని చూడవచ్చునని కథా రచయిత కాండ్రేగుల శ్రీనివాసరావు రాసిన నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

- టిడ్కో ఇళ్ళు పూర్తి చేసేవిధంగా చర్యలు
- వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి



టిడ్కో ఇళ్ళను పరిశీలిస్తున్న వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి

అద్దంకి, జనవరి 11: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయటం జరుగుతుందని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం హనిమిరెడ్డి అన్నారు. ఈనెల 6న ఆంధ్రజ్యోతిలో ప్రభుత్వ భూమి కబ్జాకు రంగం సిద్ధం, గురువారం టిడ్కో ఇళ్ళ పంపిణీ ఇక లేనట్టేనా! శీర్షికలన ప్రచురితమైన కథనాలకు హనిమిరెడ్డి, తహసీల్దార్ సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు స్పందించారు. శింగరకొండ సమీపంలో ఎర్రకుంట భూమిని వైసీపీ నాయకులు ఆక్రమించేందుకు చదును చేస్తున్న నేపథ్యంలో ఆంధ్రజ్యోతిలోకథనం ప్రచురితమైంది. దీంతో గురువారం సాయంత్రం పరిశీలించి ఆక్రమణకు సిద్ధమవుతున్నట్లు గుర్తించారు. చదును చేస్తున్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని, తగు నివేదిక ఇస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కఠిన చర్యలు తీసుకునేవిధంగా చర్యలు చేపడతానని హనిమిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ భూమి ఆక్ర మణలకు గురికాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం టిడ్కో ఇళ్ళను పరిశీలిం చారు. పనులు నిలిచిపోవటానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. టిడ్కో ఇళ్ళ లబ్ధిదారులకు జగనన్న కాలనీలలో స్థలాలు, ఇళ్ళు మంజూరుకు అవకాశం లేనందున ఇబ్బందులు పడుతున్నారని అధికారులు వివరించారు. టిడ్కో గృహాల నిర్మాణ పనులు పర్యవేక్షించే ఉన్నతాధికారులతో హనిమిరెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, కోట శ్రీనివాసకుమార్, జాగర్లమూడి యలమందరావు, గుంజి కోటేశ్వరరావు, వీరయ్య, గోపాలరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండలో దశ సహస్ర కదళీ ఫలార్చన



అరటి పండ్లతో ప్రసన్నాంజనేయస్వామి అలంకరణ

అద్దంకి, జనవరి 11: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా గురువారం దశ సహస్ర కదళీ ఫలార్చన పూజ వైభవంగా జరిగింది. ఉదయం ప్రాతఃకాల సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం, అభిషేకం నిర్వహించారు. 11 ఆవృత్తములుగా వేదపండితులు, పూజారులు పదివేల అరటిపండ్లతో పూజ నిర్వహించారు. ఉభయదాతలుగా గుంటూరుకు చెందిన శ్రీ న్యూ మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ అధినేత పొనకాల శ్రీనివాసరావు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం నిర్మాణానికి హైదారాబాద్‌కు చెందిన వాకా వెంకటరెడ్డి, అరుణ దంపతులు గురువారం 1,01,116 రూపాయల చెక్కును ఈవో సుభద్రకు అందజేశారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

అద్దంకి, జనవరి 11: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వృద్ధుడు పురుగు మందుతాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బొమ్మనంపాడుకు చెందిన కామేపల్లి వెంకటరావు(60) గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ బుధవారం రాత్రి పురుగు మందు తాగాడు. ఒంగోలు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

పంగులూరు, జనవరి 11: మండలంలోని భగవాన్‌రాజుపాలెం, రామకూరు గ్రామాల మధ్య గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జనకవరం గ్రామానికి చెందిన కనుమూరి సునీల్ (35) అనే యుకుడు మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు.. జనకవరం నుంచి కంకర కోసం ట్రాక్టర్‌పై డ్రైవర్‌తో కలసి సునీల్ రామకూరు బయలుదేరాడు. భగవాన్ రాజుపాలెం దాటి రామకూరువైపు వెళుతున్న సమయంలో రోడ్డుపై గుంతలు తప్పించే క్రమంలో డ్రైవర్ బ్రేక్ వేయగా ఆ కుదుపునకు ఇంజన్‌పై కూ ర్చున్న సునీల్ ట్రాక్టర్ చక్రం కింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ తాటాకు చప్పుళ్లకు బెదిరేదిలేదు!

- ఇళ్లకు నోటీసులు అంటించడంపై అంగన్‌వాడీలు ఆగ్రహం

అద్దంకిటౌన్, జనవరి 11: ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడితే బెదిరేది లేదని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా సభ్యురాలు జి.శారద హెచ్చరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యలు పరిష్కారం కోసం చేపట్టిన నిరవధి క సమ్మె గురువారం 31వ రోజుకు చేరుకుంది. తహసీల్దార్ కార్యాలయం వద్ద చేప ట్టిన ధర్నాకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తిరుపతిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం జారీచేసిన షోకాజ్ నోటీసులు అంగన్‌వాడీ కేంద్రాలకు అంటించకుండా, కార్యకర్తల ఇళ్లకు అంటించడం దుర్మార్గమన్నారు. కేంద్రాలకు అంటించాల్సిన నోటీసులను మా ఇళ్లకు ఎలా అంటిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటీసులు తీసుకోని కార్యకర్తలపై అధికారులు బెదిరింపులకు పాల్పడడంతో విషయం తెలుసుకున్న సీఐటీయూ, అంగన్‌వాడీ కార్యకర్తలు మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా చేపట్టారు.

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులుతో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మాట్లాడారు. నోటీసులను ఇళ్లకు అంటించడం, కార్యకర్తలను బెదిరించ డం ఏమిటని ప్రశ్నించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చేస్తున్నామని కమిషనర్ చెప్పారు. కార్యకర్తలపై బెదిరింపులకు పాల్పడవద్దని వినతిపత్రం అందజేసేందుకు సంఘ నాయకులు ప్రయత్నించగా, మున్సిపల్ కమిషనర్ దానిని తీసుకోకుండా తహసీల్దార్‌కు ఇ చ్చుకోండని అన్నారు. దీంతో సంఘ నాయకలు, అంగన్‌వాడీ కార్యకర్తలు మేము కేం ద్రాలలో లేకపోతే ఇళ్లకు వచ్చి అంటిస్తున్నారని, అదేవిధంగా కమిషనర్ తీసుకోక పోతే ఆయన కార్యాలయానికి వినతి పత్రం అంటించాలని, ఆమేరకు అంటించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా తరలివెళ్లారు.

ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలి

చీరాలటౌన్, జనవరి 11: అంగన్‌వాడీలపై ఎస్మాను ప్రయోగించడం అన్యాయమని, వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ ప్రతినిధులు డిమాండ్ చేశారు. గతకొంత కాలంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నారు. గురువారం పట్టణంలో సీఐటీయూ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వసంతరావు, ఎల్.జయరాజ్, గూడూరి శివరామప్రసాద్, మధు, ఎస్.బాబురావు, శంకర్, అంజనేయులు, సురేష్, చెంచయ్య, సుకన్య, ఐవీ ప్రసాద్ పాల్గొన్నారు.

సెమీస్‌కు చేరిన వైజాగ్, చెన్నై జట్లు

- ఉత్కంఠభరితంగా సాగుతున్న క్రికెట్ పోటీలు



సౌత్‌జోన్‌సీసీ చెన్నై-కోకా ఇన్‌ఫ్రా లెవెన్ హైదరబాద్ మధ్య జరుగుతున్న మ్యాచ్

మేదరమెట్ల , జనవరి 11: రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీభమర సంక్రాంతి కప్ క్రికెట్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. గురువారం మూడవరోజు టాస్ గెలిచిన జట్లు విజయం సాధించాయి. ఉదయం యువన్ పావర్టిస్ లెవెన్ హైదరాబాద్, సిక్కోలు సీతాస్ వైజాగ్ మధ్య పోటీ ఉత్కంఠభరితంగా సాగింది. సిక్కోలు జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన యువన్ పావర్టీస్ హైదరబాద్ జట్టు నిర్ణీత 20ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. అనంతరం బ్యాంగ్‌కు దిగిన సిక్కోలు జట్టు 13.3 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి 177 పరుగులు చేసి విజయం సాధించింది.

సాయంత్రం జరిగిన పోటీలలో సౌత్‌జోన్ సీసీ చెన్నై, కోకా ఇన్‌ఫ్రా లెవెన్ హైదరబాద్‌జట్లు మధ్య పోటీ జరిగింది. టాస్ గెలిచిన చెన్నై జట్టు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 20 ఓవర్లలో 5 వి కెట్లు కోల్పోయి 160 పరుగులు సాధించింది. అనంతరం బ్యాంటింగ్‌కు దిగిన కోకా ఇన్‌ఫ్రా హైదరబాద్ జట్టు 19.2 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌట్ ఓటమి పాలయింది. ఉదయం సాయంత్రం జరిగిన పోటీలలో గెలుపొందిన సిక్కోలు సీతాస్ వైజాగ్ జట్టు, సౌత్ జోన్ సీసీ చెన్నై జట్టు సెమి ఫైనల్స్‌కు చేరాయి.

శుక్రవారం ఉదయం తండర్‌బోల్ట్ తిరుపతి, మెగావరియర్స్ విజయవాడ మధ్య, సాయంత్రం లైన్స్ క్లబ్ క్రికెట్ బెంగుళూర్, ప్రసాద్ జెడ్‌ఫోర్స్ హైదరబాద్ జట్ల మధ్య పోటీ జరుగుతుందని రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి , కోశాధికారులు యడ్లపల్లి నరసింహారావు, కారుసాల ప్రతాప్ తెలిపారు.

రసవత్తరంగా క్రికెట్ పోటీలు

పంగులూరు, జనవరి 11: మండలంలోని కొండమంజులూరులో జరుగుతున్న టీ20 ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు గురువారం రసవ త్తవరంగా సాగాయి. గురువారం ఉదయం జార్ఖండ్, బెంగులూరు జట్ల మధ్య జరిగిన పోటీలో టాస్ గెలిచిన బెంగుళూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకొంది. ముందుగా బ్యాటింగ్ చేపట్టిన జార్ఖండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 191 పరుగులకు ఆలౌట్ అయింది. 192 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన బెంగుళూరు జట్టు 12.5 ఓవర్లలో 126 పరుగులకు ఆలౌట్ అయి ఓటమి పాలయింది. జార్ఖండ్ జట్టు క్రీడాకా రుడు హరీష్‌రెడ్డి 3 ఓవర్లకు 26 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీసుకుని మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. సాయంత్రం జరిగిన పోటీ లో బుల్స్ ఒంగోలు, బళ్ళారి జట్లు తలపడగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బళ్ళారి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 255 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన బుల్స్ ఒంగోలు జట్టు 134 పరుగులకే ఆలౌట్ అయి ఓటమి పాలయింది. బళ్ళారి జట్టు క్రీడాకారుడు తహ 47 బంతులలో 16 ఫోర్లు, 5 సిక్స్‌లతో 104 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

శుక్రవారం ఉదయం కేరళ, గుజరాత్ జట్లు, సాయంత్రం ఆంధ్రప్ర దేశ్, తెలంగాణ జట్లు తలపడనున్నాయని పోటీల నిర్వాహకులు కరణం స్వామి తెలిపారు.

ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ — ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

HOUSE FOR SALE

■ ఒంగోలు కర్నూల్‌రోడ్ లింగారెడ్డి అపార్ట్‌మెంట్ రోడ్ 160 చ॥గ॥లో నూతనంగా నిర్మించిన పడమర ఫేసింగ్ 3 ఇండిపెండెంట్ (2BHK) ఇల్లులు అమ్మకమునకు కలవు. వెంటనే సంప్రదించండి: SSS హోమ్స్ సంప్ర॥ సెల్: **9703998899, 7569476242**

AJO-183520

WANTED

■ ఒంగోలులోని సుందరయ్య భవన్ రోడ్డు నందు గల విజయ షుగర్ హాస్పటల్ నందు పనిచేయుటకు (MBBS) లేడి డాక్టర్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్రదించగలరు: **8885646777**

AJO-182

అమ్మబడును

■ నెల్లూరు జిల్లా, కందుకూరు బైపాస్ ప్రక్కన 80 గదులు. గది 20 వేలు, బైపాస్ ప్రక్కన పొలం కూడా అమ్మబడును. కొటారెడ్డి నగర్, బెవిన్యూ కాలనీలో 210,40 గదుల ఇంటిస్థలం అమ్మబడును. సంప్ర॥ **9704250705**

AJO- 151142

SSC-GD ఉచిత శిక్షణ

■ **26,146** SSC-GD కానిస్టేబుల్స్ ఉద్యోగాలకు అప్లయి చేసిన, అర్హత గల వారికి 100% జాబ్ గ్యారెంటి శిక్షణ. 23 సంవత్సరాల అనుభవం- గత ఫలితాలు గల సంస్థ. స్టార్ డిఫెన్స్ అకాడమి, నంద్యాల, సెల్: **87908 44959**

AJL-155550

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

హరివిల్లు.. సిరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్





ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

కెనరా బ్యాంక్ केनरा बैंक Canara Bank — A Government of India Undertaking — Together We Can

ఆంధ్రజ్యోతి ABN

AIMS INSTITUTES Peenya, Bangalore — AIMS Empowering Minds — +91 81500 01994

SWARGASEEMA SUKETANA Ph: + 91 98490 12500



విజేతలు వీరే..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆద్రిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)



తీగ లాగితే.. డొంకంతా కదిలినట్లు సంగం ఇరిగేషన్ సెక్షన్‌లో పనులు చేయకనే పైసలు నొక్కేసే యత్నంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో ఇరిగేషన్ శాఖతోపాటు అధికార పార్టీ నేతల్లో కలకలం రేగింది. గతంలో కూడా ఇదే విధంగా దొంగ బిల్లులతో పలువురు ముఖ్యనేతలు జేబులు నింపుకున్నట్లు అదేపార్టీకి చెందిన నాయకులు గుసగుసపోతున్నారు. అయితే గతంలో ఐదారుగురు కీలక నేతల భాగస్వామ్యం ఉండటంతో గుట్టుచప్పుడు కాకుండా పంపకాలు జరిగిపోయాయని, ఈసారి వారందరినీ పక్కన పెట్టడం వల్లే గుట్టురట్టయ్యిందని అంటున్నారు.

దొంగ బిల్లుల్లో గతంలో కీలక నేతలకు వాటా

అప్పట్లో ఆ అధికారే సూత్ర, పాత్రధారి • రూ.2 కోట్లకుపైగా పంపకాలు

ఇప్పుడు ఒకరే బిల్లు చేసుకోవడంతో వెలుగులోకి..

పంపకాలు లేకనే బహిర్గతం!

సంగం, జనవరి 11 : 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక సంగం సెక్షన్‌కు కొత్తగా వచ్చిన అధికారి హయాం నుంచే దొంగ బిల్లులు వ్యవహారం నడిచిందనే ఆరోపణలు ఉన్నాయి. డెల్టాలో సాధారణంగా కాలువ పూడిక, ఇతర పనులకు రబీ సీజన్‌కు ముందు ఐఏబీ సమావేశంలో ప్రతిఏటా ఓఅండ్‌ఎం నిధులు మంజూరు చేస్తారు. 2019 నుంచి రూ.లక్ష దాటిన టెండర్ వర్కులను బినామీల పేరుతో స్థానిక నేతలే పనులు చేస్తున్నారు. మళ్లీ ఏడాది కూడా పనులు జరిగాయి. అయితే రెండు దఫాలు చేసిన పనులకు బిల్లులు సరిగా రాకపోవడంతో తరువాత ఇరిగేషన్ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీన్ని ఆసరా చేసుకున్న ఆ అధికారి అక్రమాలకు తెరలేపినట్లు ఆరోపణలు ఉన్నాయి. నెల్లూరులో తనకు సుపరిచితుడైన ఓ కాంట్రాక్టర్ పేరుతో పనులు చేజిక్కించుకోవడం, అగ్రిమెంట్లు చేసుకోవడం, ఆ తరువాత బిల్లులు రావని కాంట్రాక్టర్ చేతులెత్తేసినట్లు ప్రచారం చేయడం, అందరూ ఆదమరిచిన తరువాత పనులు చేయకుండానే స్థానిక నేతలతో కుమ్మక్కై వాటాలు పంచుకున్నట్లు ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. ఇందులో ఆ అధికారే సూత్రధారి, పాత్రధారిగా మారి అన్ని చక్కదిద్దేవాడిని సమాచారం. ఈ క్రమంలోనే 2020, జూలైలో రెండవ పంట కోసం కావలి కాలువకు నీటి సరఫరాకు సంగం ఆనకట్టపై రూ.20 లక్షలతో ఇసుక బస్తాలు టెండర్లు దక్కించుకున్నారు. అయితే, పాత బస్తాల్లో కొన్నింటినే తొలగించి వాటిపై కొత్త బస్తాలు వేసి పూర్తిగా బిల్లు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.





సంగం ఆనకట్ట ఫాలింగ్ షట్టర్ల వద్ద పాత ఇసుక బస్తాలపైనే కొత్త బస్తాలు వేస్తున్న కూలీలు (ఫైల్)

• వరదలో కొట్టుకుపోయాయని..

ఏటా రబీ సీజన్‌లో డిసెంబరు నెలాఖరు, జనవరి మొదటి వారంలో ఆనకట్టపై ఇసుక బస్తాలు వేస్తారు. కానీ, 2021లో ముందుగా నవంబరు 5వ తేదీనే రూ.32 లక్షలతో ఇసుక బస్తాల రింగ్ బండ్ మొదలు పెట్టారు. నాల్గవ వంతు మాత్రమే వేశారు. ఇంతలో నవంబరు 27వ తేదీన భారీ వరద రావడంతో వేసిన ఇసుక బస్తాలు కొట్టుకుపోయాయి. అయితే, పూర్తిగా వేసిన ఇసుక బస్తాలు వరదకు కొట్టుకు పోయినట్లు ఫ్లడ్ డ్యామేజ్‌లో చూపించి బిల్లులు పెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో జనవరిలో మళ్లీ టెండరు పిలవడంతో అదే వ్యక్తి కాంట్రాక్టర్ దక్కించుకుని ఇసుక బస్తాలు వేసి బిల్లులు పెట్టుకున్నారు. దీంతోపాటు ఆ 2021లో ఎఫ్‌డీఆర్ కింద మంజూరయిన కొన్ని పనులకు అదే కాంట్రాక్టర్ పేరుతో దొంగ బిల్లులు పెట్టి అందులో సగం మండలంలోని ఐదారుగురు కీలక నేతలకు వాటాలు పంచినట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారంలో రూ.2 కోట్లకు పైగా అవినీతి జరిగి ఉంటుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందులో అధికారి, కాంట్రాక్టర్, కీలక నేతలు సమానంగా పంచుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

• నేతల భాగస్వామ్యం లేకనే..

నాడు వాటాలు పంచుకున్న వారిలో ప్రస్తుతం దొంగ బిల్లులకు ప్రయత్నించిన నేతతోపాటు మరో నలుగురు నేతలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ క్రమంలో ఇటీవల దొంగ బిల్లులతో పైసలు నొక్కేసే యత్నంలో ఆ కీలక నేతల భాగస్వామ్యం లేకపోవడంతో విషయం బహిర్గతం చేశారని అధికార పార్టీకి నాయకులే చెబుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి బదిలీపై వెళ్లిన అధికారి హయాంలో 2020-21, 2021-22లో ఎఫ్‌డీఆర్, ఓఅండ్‌ఎం నిధులతో జరిగిన పనులపై విజిలెన్స్‌తో విచారణ చేయిస్తే అవినీతి బాగోతం బహిర్గతమవుతుందని అధికార పార్టీ నాయకులతోపాటు రైతులు కోరుతున్నారు.

అధిష్ఠానం తీరుపై అసంతృప్తి, ఆగ్రహం

• కందుకూరు వైసీపీలో గందరగోళం

• రిటన్ గిఫ్టు ఇచ్చేందుకు సిద్ధమవుతున్న కేడర్

కందుకూరు, జనవరి 11 : కందుకూరు నియోజకవర్గ వైసీపీలో గందరగోళం నెలకొంది. సిటింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డిని కాదని కొత్తవారికి టిక్కెట్ ఇచ్చేదిశగా అధిష్ఠానం చేస్తున్న ప్రయత్నాలపై ఆ పార్టీ క్యాడర్‌లో తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గంలో బుధవారం జరిగిన కీలక పరిణామాలలో నలుగురు బీసీ యాదవ సామాజికవర్గ నేతల పేర్లతో ప్రజాభిప్రాయ సేకరణ చేయడం, ఆ తర్వాత కూడా అధిష్ఠానం అదే ఆలోచనతో ముందుకు సాగుతున్నట్లు సంకేతాలు వస్తుండటంతో వైసీపీ క్యాడర్ తీవ్ర ఆగ్రహంతో ఉంది. మహీధరరెడ్డికి టికెట్ ఇవ్వాలంటే ఆయన ముందుగా టీడీపీ అధినేత చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేష్‌లను తీవ్రంగా విమర్శించాలని షరతు విధించారు. అకారణంగా ప్రతిపక్ష నేతలపై విమర్శలు చేసే పనిలేదు.. ఆ తర్వాత టికెట్ మీ ఇష్టం... అని మహీధరరెడ్డి అధి ష్ఠానం దూతలతో స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అంతేగాక ఎన్నికల వ్యయానికి కూడా పెద్దమొత్తంలో ముందుగా డిపాజిట్ చేయాలన్న నిబంధనకూడా మహీధరరెడ్డికి పెట్టగా అందుకు ఆయన తిరస్కరించినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కనీసం మహీధరరెడ్డిని సంప్రదించకుండా ప్రత్యామ్నాయ అభ్యర్థుల కోసం పార్టీ వెదుకులాట ప్రారంభించటం తో పార్టీ క్యాడర్‌లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ అభ్యర్థిగా మహీధరరెడ్డి కాకుండా మరెవరైనా పోటీ నామమాత్రంగా మారుతుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. అంతేగాక నియోజకవర్గంలో జరిగిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ద్వితీయ శ్రేణి నాయకులు, పార్టీ కార్యకర్తలకు రమారమి రూ.100 కోట్లు వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏడాదికాలంగా ఆ బిల్లులు విడుదల చేయాలని ఎమ్మెల్యే అధిష్ఠానం పెద్దలు, అధికారులపై ఒత్తిడి చేస్తున్నా ఏమీ ప్రయోజనం లేదని చెబుతున్నారు. మహీధరరెడ్డిపై అనుమానంతో ఎంతోకాలంగా నిఘాపెటారని ఆ మిషతో ఏడాది నుంచే కందుకూరుపై అధిష్ఠానం కుట్ర చేస్తున్నదన్న అభిప్రాయానికి వచ్చిన స్థానిక నేతలు అధిష్ఠానం తీరుపై మండిపడుతున్నారు. పార్టీ కోసం పదమూడేళ్లుగా కష్టపడి పనిచేసి అన్నివిధాలుగా నష్టపోయి అధికారంలోకి వచ్చేలా చేస్తే చివరికి కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో పెట్టి జగన్ మాకు గొప్ప బహుమతి ఇచ్చాడని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్న రెండు, మూడురోజుల్లో పరిస్థితులు మారవచ్చని ఇప్పటికీ ఆశాభావం వ్యక్తం చేస్తున్న కొందరు నేతలు మాత్రం అధిష్ఠానం తీరుమారకుంటే తామూ రిటర్న్ గిఫ్ట్ ఇచ్చి తీరుతామని స్పష్టం చేస్తున్నారు.





ఛీ.. ర్యాంకు మిస్సైంది!

• స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో కానరాని నెల్లూరు • దేశవ్యాప్తంగా 130వ స్థానానికి పరిమితం

• రాష్ట్రంలో 6వ స్థానంతో ఊరట • కందుకూరుకు మెరుగైన ర్యాంకు

నెల్లూరు (సిటీ), జనవరి 11 : స్వచ్ఛ సర్వేక్షణ్ పేరిట నెల్లూరు నగర పాలక సంస్థ అధికారులు చేసిన కృషి, నిర్వహించిన కార్యక్రమాలు బూడిదలో పోసిన పన్నీరైంది. దేశంలో తొలి 100 నగరాల్లో నెల్లూరు సిటీ ఏమాత్రం శుభ్రంగా లేదని తేల్చిన కేంద్రం ర్యాంకుల వరుసలో 130వ స్థానానికి నెట్టేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన శుభ్రమైన నగరాల్లో నెల్లూరు జాడలేకుండా పోయింది. స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో ఏపీలో వైజాగ్ 4వ స్థానం, విజయవాడ 6, తిరుపతి 8, గుంటూరు 17వ స్థానాలు దక్కించుకుని ఉనికి నిలబెట్టుకున్నాయి. వీటికి సమీప దూరాన కూడా లేని నెల్లూరు 130వ స్థానంలో నిలిచింది. స్వచ్ఛ నెల్లూరు పేరిట అధికారులు ఊపిరితిప్పుకోకుండా నిర్వహించిన వరుస కార్యక్రమాలు ఫలితానివ్వలేదు. పైగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో మున్సిపల్ యంత్రాంగం ఘోరంగా విఫలమైందన్న విమర్శలు మూటగట్టుకోవాల్సి వచ్చింది. అయితే రాష్ట్ర జాబితాలో 6వ స్థానంలో నిలబడటంతో కాస్త అధికారులకు ఊరటదక్కింది.

• కందుకూరుకు 3వ స్థానం

కందుకూరు : స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో రాష్ట్రస్థాయిలో కందుకూరు మున్సిపాలిటీకి 3వ స్థానం దక్కినట్లు కమిషనర్ ఎస్.మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులలో 2020లో 5వ స్థానంలో నిలవగా గత సంవత్సరం 4, ప్రస్తుతం మూడవ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

కొందరికే 'తోడు'

• 8వ విడత విడుదల

• 18,858 మందికి రూ.19.95 కోట్ల రుణాలు

నెల్లూరు(హరనాథపురం), జనవరి 11 : చిరువ్యాపారుల కోసం ఉద్దేశించిన జగనన్న తోడు పథకం ద్వారా 8వ విడతలో కొందరికే లబ్ధిచేకూరింది. ఈ పథకం ద్వారా చిరు వ్యాపారులు, సంప్రదాయ వృత్తిదారులకు రూ.10 వేల నుంచి రూ.15వేల వరకు ఆర్థిక సహాయ రుణాలను ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందచేస్తోంది. జిల్లాలో డీఆర్‌డీఏ-వైఎస్‌ఆర్‌కేపీ, మెప్మా ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రస్తుత 8వ విడతలో 18,858 మంది లబ్ధిదారులకు రూ.19.95కోట్లు రుణాల కింద అందచేశారు. అయితే అందరు చిరు వ్యాపారులకు ఈ పథకం ద్వారా లబ్ధిచేకూరలేదన్న ఆరోపణలున్నాయి. కాగా, చిరువ్యాపారుల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా జగనన్న తోడు పథకానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రూపకల్పన చేశారని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జగన్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమచేయగా, నెల్లూరు కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన కార్యక్రమంలో అరుణమ్మ, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి, మెప్మా పీడీ రవీంద్ర పాల్గొన్నారు. లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు.



మెగా చెక్కు అందజేస్తున్న ఆనం అరుణమ్మ, అధికారులు

ప్రభుత్వం విధానం మారాలి

ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉప కార్యదర్శి సుబ్రహ్మణ్యం

నెల్లూరు (వైద్యం): అంగన్‌వాడీ కార్యకర్తలపై రాష్ట్ర ప్రభుత్వ విధానం మారాలని ఎస్‌డబ్లుఎఫ్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం హితవు పలికారు. డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె గురువారానికి 31వ రోజుకు చేరుకుంది. జిల్లాలోని ఐసీడీఎస్ కేంద్రాల వద్ద ఆందోళనలు కొనసాగుతుండగా, నగరంలోని కలెక్టరేట్ వద్ద జరుగుతున్న దీక్షలో సుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడారు. మహిళలు అని కూడా చూడకుండా సీఎం అనుసరిస్తున్న వైఖరి సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్లుఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, నాగేంద్రరావు, ఎస్కే మౌలాలి. ఏవిఎస్ రెడ్డి, సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, నాగేశ్వరరావు, అంగన్‌వాడీ యూనియన్ నేతలు సుజాత, కామాక్షమ్మ, రజనీ, మల్లెమ్మ, రమాదేవి, సుమతి, ఉషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నేత సుబ్రహ్మణ్యం

'ఆడుదాం ఆంధ్రా'లో ఇదేం తీరు!

• అధికారులపై భగ్గుమన్న క్రీడాకారులు • నిబంధనలు పాటించడంలేదని ఆగ్రహం

• చివరకు నేడు నిర్వహిస్తామని చెప్పడంతో విరమణ

వరికుంటపాడు, జనవరి 11 : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా'లో అధికారుల తీరుపై క్రీడాకారులు మండిపడ్డారు. వారంతా రాజకీయ కోణంలో వ్యవహరిస్తున్నారంటూ గురువారం సాయంత్రం వరికుంటపాడు ఎమ్పీడీవో కార్యాలయం ఎదుట భైఠాయించి ఆందోళన చేశారు. వరికుంటపాడు, పెద్దిరెడ్డిపల్లి గ్రామాల జట్లకు బుధవారం కబడ్డీ ఫైనల్ నిర్వహించాల్సి ఉండగా చీకటి పడటంతో గురువారానికి వాయిదా వేశారు. ఉదయం వరికుంటపాడు జట్టు మైదానానికి చేరుకున్నా ప్రత్యర్థి జట్టు రాకపోవడంతో సాయంత్రానికి వాయిదా వేసి ఖోఖోను యథావిధిగా నిర్వహించారు. వరికుంటపాడు, తిమ్మారెడ్డిపల్లి జట్లు తలపడుతుండగా నిబంధనలు పాటించడంలేదని ప్రశ్నించినందుకు తమపై ఎంపీడీవో శ్రీదేవి పరుష పదజాలంతో మాట్లాడారని వరికుంటపాడు క్రీడాకారులు వాపోయారు. పోటీలో తిమ్మారెడ్డిపల్లి జట్టు విజయం సాధించడంతో వేదికపై ఉన్న అధికారులు వారికి మద్దతుగా కేకలు వేయడంతో వరికుంటపాడు క్రీడాకారుల్లో అసహనం పెరిగింది. తమను పరుష పదజాలంతో ఎందుకు దూషించారంటూ నిలదీశారు. దీంతో ఎమ్పీడీవో ఎదురుదాడికి దిగడంతో ఆమెకు మద్దతుగా నిలిచిన ఉద్యోగులు, క్రీడాకారులకు తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకొంది. అనంతరం ఎమ్పీడీవో కార్యాలయానికి చేరుకున్నా పట్టువదలని క్రీడాకారులు అక్కడకూ చేరుకుని నినాదాలతో హోరెత్తించారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు మల్లికార్జున, ఎస్ఐ సుమన్ తమ సిబ్బందితో అక్కడకు చేరుకొని క్రీడాకారులను సముదాయించినా వారు వినలేదు. ఎమ్పీడీవో క్షమాపణ చెప్పాల్సిందేనంటూ రాత్రయినా సెల్‌ఫోన్ లైట్ల వెలుగుల్లో కార్యాలయ ముఖద్వారం వద్ద భైఠాయించారు. చివరికి ఎంపీడీవోతో చర్చించిన అనంతరం తహసీల్దారు బయటకు వచ్చి శుక్రవారం ఇరుజట్లకు రామాపురం క్రీడా మైదానంలో పోటీలు నిర్వహిస్తామని చెప్పి వెళ్లిపోయారు. పోలీసుల హెచ్చరికలతో క్రీడాకారులు కూడా శాంతించి వెళ్లిపోయారు. ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన కబడ్డీ పోటీ శుక్రవారం ఎంతమేర జరుగుతుందోనన్న ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది.



సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో ఆందోళన చేస్తున్న క్రీడాకారులు

సంక్రాంతి పండుగను బంధు,మిత్రులతో జరుపుకునేందుకు నగర, పట్టణాల్లో స్థిరపడిన వారంతా సొంతూళ్లకు పయనమవుతున్నారు. విద్యాసంస్థలతోపాటు శనివారం నుంచి నాలుగు రోజులు సెలవులు ఉండటంతో ఇంటిల్లిపాది పయనమవుతున్నారు. అయితే, తాళం వేసిన ఇళ్లను దోచేందుకు దొంగలు సిద్ధమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇంటి యజమానులు జాగ్రత్తలు వహించాలంటూ పోలీస్ అధికారులు కొన్ని సూచనలు చేస్తున్నారు.

ఊళ్లకు వెళుతున్నారా.. దొంగలతో జాగ్రత్త!

• ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో ఇంటికి రక్ష

• పోలీసుల నిరంతర పర్యవేక్షణకు యాప్





నెల్లూరు (క్రైం), జనవరి 11 : సంక్రాంతి పండుగను బంధుమిత్రులతో జరుపుకునేందుకు నగర, పట్టణాల్లో స్థిరపడిన వారంతా సొంతూళ్లకు పయనమవుతున్నారు. విద్యాసంస్థలతో పాటు శనివారం నుంచి నాలుగు రోజులు సెలవులు ఉండటంతో ఇంటిల్లిపాది పయనమవుతున్నారు. అయితే, తాళం వేసిన ఇళ్లను దోచేందుకు దొంగలు సిద్ధమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇంటి యజమానులు జాగ్రత్తలు వహించాలంటూ పోలీస్ అధికారులు కొన్ని సూచనలు చేస్తున్నారు.

● ఇళ్లకు తాళాలు వేసుకొని సొంతూళ్లకు వెళ్లే ప్రజలు పోలీసు శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్) సేవలను సద్వినియోగం చేసుకుంటే దొంగతనాలకు అరికట్టవచ్చు.



ఎల్‌హెచ్‌ఎమ్ఎస్ యాప్

● స్మార్ట్ ఫోన్‌లోని గూగుల్ ప్లే స్టోర్‌లో ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇన్‌స్టాల్ అయ్యాక అందులో మీ పేరు, వివరాలు పొందుపరచాలి. మీ ఇంటి వద్ద నుంచే లాగిన్ కావాలి. లాగిన్ అయిన వెంటనే వన్‌టైమ్ పాస్‌వర్డ్ వస్తుంది. దానిని నమోదు చేశాక యూనిక్ ఐడీ వస్తుంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఎల్‌హెచ్‌ఎంఎస్‌లో నమోదు పూర్తవుతుంది.

• ఎల్‌హెచ్‌ఎంఎస్ వినియోగం..

ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లే ప్రజలు ముందుగా ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌లోకి వెళ్లి రిక్వెస్టు పోలీసు వాచ్‌ను ఎంపిక చేసుకోవాలి. ఏ తేదీన ఏ సమయానికి ఊరు వెళుతున్నారు, తిరిగి ఎప్పుడు వస్తారు అన్న వివరాలు యాప్‌లో పొందుపరచాలి. వెంటనే ఆ సమాచారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. అప్పుడు సిబ్బంది ఆ ఇంటికి వైఫైతో పనిచేసే నిఘా కెమెరాలను అమర్చుతారు. ఆ ఇంట్లో ఎలాంటి కదలికలు ఉన్నా కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సైరన్ మోగుతుంది. వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్, రక్షక్, బ్లూకోల్ట్స్ వాహనాలకు సమాచారం వెళ్తుంది. దీంతో పోలీసులు వెంటనే దొంగలు చొరబడ్డ ఇంటికి చేరుకొని వారిని పట్టుకునేందుకు అవకాశం ఉంటుంది.

గస్తీ పెంచుతున్నాం

సంక్రాంతి పండుగను కుటుంబసభ్యులతో సంతోషంగా జరుపుకునేందుకు సొంతూళ్లకు వెళుతున్న ప్రజలు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను ఉపయోగించుకోవాలి. ఇళ్లకు తాళాలు వేసి వెళుతున్నప్పుడు ఇంట్లో విలువైన వస్తువులు, నగదు ఉంచవద్దు. బ్యాంకు లాకర్‌లో జాగ్రత్త చేసకోవడం మంచిది. పండుగలను దృష్టిలో ఉంచుకొని రాత్రి పూట గస్తీ పెంచుతున్నాము.

- డీ శ్రీనివాసరెడ్డి, నగర డీఎస్పీ

హాజరు ఎంత!?

• వైద్య విద్య కళాశాలలపై ఎన్ఎంసీ నిఘా

• బయోమెట్రిక్ అటెండెన్స్‌పై మార్గదర్శకాలు

• 75 శాతం వైద్యుల హాజరుపై తాజా ఆదేశాలు

• మెడికోలకూ బయోమెట్రిక్ తప్పనిసరి



బయోమెట్రిక్ ద్వారా హాజరు వేస్తున్న ప్రభుత్వ వైద్యులు

నెల్లూరు (వైద్యం) జనవరి 11 : వైద్య కళాశాలలపై జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ప్రత్యేక నిఘా పెడుతోంది. ఇప్పటివరకు వైద్యుల హాజరుపై పట్టీపట్టనట్టు ఉన్న ఎన్ఎంసీ ఇక నుంచి తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరును పర్యవేక్షించనుంది. ఆధార్ ఎనేబుల్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చింది. బయోమెట్రిక్ వేయకుంటే ఆ రోజు ఆ వైద్యుడు హాజరు కానట్టే లెక్క. తప్పనిసరిగా 75 శాతం హాజరు ఉండాలి. లేకుంటే షోకాజ్ నోటీసులతోపాటు విధుల నుంచి తొలగించే అవకాశం కూడా ఉంది. వైద్యుల హాజరుపై రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) అమలులోకి తెచ్చింది. బయోమెట్రిక్ ద్వారా చాలా మంది వైద్యులు సరిగ్గా అటెండెన్స్ వేయడం లేదన్న ఉద్దేశంతో ఈ విధానం తీసుకు వచ్చింది. అయితే, ఈ విధానాన్ని కూడా కొందరు వైద్యులు పాటించడంలేదని గతంలో జరిగిన సమీక్షలో డీఎంఈ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వం జనరల్ ఆసుపత్రిలో రోగులకు వైద్యులు అందుబాటులో ఉండటం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఈ నెల నుంచే ఆధార్ ఎనేబుల్ బయోమెట్రిక్ సిస్టమ్ ద్వారా అటెండెన్స్ తప్పనిసరి చేస్తూ ఎన్ఎంసీ జారీ చేసినట్లు తెలుస్తోంది.

• మెడికోలకూ అమలు

ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో చదివే మెడికోలకు కూడా ఆధార్ ఎనేబుల్ బయోమెట్రిక్ సిస్టమ్ ద్వారా హాజరు కావాల్సి ఉంటుంది. ఈ మేరకు ప్రభుత్వం వైద్య కళాశాలకు అనుమతులు వచ్చినా ఇంకా యాప్‌ను విడుదల చేయలేదు. ప్రస్తుతం ఎంబీబీఎస్ చదివే విద్యార్థులు హౌస్ సర్జన్ పూర్తయ్యేసరికి 875 మంది ఉండగా వీరంతా ఆధార్ ఎనేబుల్ బయోమెట్రిక్ సిస్టమ్ ద్వారా హాజరు కావాల్సి ఉంటుంది. 75 శాతం హాజరు లేకపోతే పరీక్షలకు అనుమతించరు.

పెరుగుతున్న అటెండెన్స్

నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వం వైద్య కళాశాలలో ఆధార్ ఎనేబుల్ బయోమెట్రిక్ సిస్టమ్ ద్వారా వైద్యుల హాజరు పెరిగింది. ఇక్కడ 235 మంది వైద్యులు ఉండగా గురువారం 217 మంది హాజరుతో 92 శాతం మంది హాజరు అయ్యారు. అలాగే ప్రైవేట్ సంస్థ నారాయణ వైద్య కళాశాలలో 400 మందికి పైగా వైద్యులు ఉండగా అందరూ ఆధార్ ఎనేబుల్ బయోమెట్రిక్ సిస్టమ్ ద్వారా హాజరు వేస్తున్నారు. ప్రతిరోజు ఎంత మంది హాజరు అవుతున్నారు. వారి వివరాలు, ఎంత శాతం హాజరు వంటి విషయాలను ఎన్ఎంసీకి పంపుతున్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కావలిటౌన్, జనవరి 11: అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని జేవీవీ, యూటీఎఫ్ రాష్ట్ర నేతలు జానకీరామ్, శ్రీదేవిలు డిమాండ్ చేశారు. గురువారం నాటికి అంగన్‌వాడీల సమ్మె 31రోజులు పూర్తిచేసుకుంది. సమ్మెలో జేవీవీ, యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు పాల్గొని సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం హేయమైన చర్యగా అభివర్ణించారు. సీఎం అంగన్‌వాడీ లకు ఇచ్చిన మాట నిలబెట్టుకుని తన నిజాయితీ నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయు నేతలు పీ పెంచలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు టీ మాల్యాద్రి, యూనియన్ నేతలు రఘురావమ్మ, విజయలత, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.


కావలిటౌన్ : శిబిరంలో సంఘీభావం తెలుపుతున్న జేవీవీ, యూటీఎఫ్ రాష్ట్ర నేతలు జానకీరామ్, శ్రీదేవి



ఆత్మకూరు : ర్యాలీలో పాల్గొన్న సీపీఎం, ప్రజాసంఘాల నేతలు

కావలి: పలు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన సీఎం జగన్మోహన్ రెడ్డి వాటిని అమలు చేయాలని అంగన్‌వాడీలు పోరాటాలు చేస్తుంటే, వారిపై నిర్బంధాలు ఏమిటని ప్రతిపక్షాలు మండిపడ్డాయి. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య అధ్యక్షతన ప్రతిపక్ష నేతలు సమావేశమై అంగన్‌వాడీల పోరాటానికి తమ సంపూర్ణమద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు మద్దతుగా ఈనెల 13న కావలిలో ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బలిజేపల్లి వెంకటేశ్వర్లు(సీపీఐ) చింతాల వెంక్రటావు (కాంగ్రెస్) జ్యోతిబాబూరావు(టీడీపీ) కరువది భాస్కర్(సీపీఐ ఎంఎల్, న్యూడెమోక్రసీ) పీ. సాయి విఠల్(జనసేన) పీ. మహేష్ (ఎఫ్‌బీఐ) సీఐ టీయూ నాయకులు టీ. మాల్యాద్రి, కృష్ణమోహన్, దర్గా బాబు, ఏఐటీయూసీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట: వైసీపీ ప్రభుత్వ పాలనపై ప్రజలు తిరగబడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య, టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు అన్నారు. బోగోలు అరుంధతీవాడలోని సచివాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన నిరసనకు సీపీఎం, టీడీపీ, సీఐటీయూ, జైభీం అంబేద్కర్ సేవా దళ్‌లు గురువారం మద్దతు పలికాయి. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్ వాడీల న్యాయమైన కోరికలను తీర్చకపోతే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చల్లా నరహరి, లక్కాకుల మాధవరావు, బత్తుల రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మెకు మద్దతుగా గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా సీపీఎం నేతలు మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీపీఎం, ఐద్వా ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు విధులను బహిష్కరించి ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో బైఠాయించి సమ్మెను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి రాధ, పలువురు సెక్టార్ లీడర్లు కె రమణమ్మ, కామేశ్వరి, జమీల, విజయలక్ష్మీ, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ పాల్గొన్నారు.

అనంతసాగరం: సమస్యల పరిష్కారం కోసం స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు గురువారం నిరసన చేపట్టారు. ప్రభుత్వం డిమాండ్లు నెరవేర్చే వరకు పోరాటం ఆగదని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్‌బాషా, రంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు గురువారం నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా అమలు చేసినా సమ్మె విరమించే ప్రసక్తేలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, ఫరుద్దీన్‌బాషా, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు


బాల్‌బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్

ఆత్మకూరు, జనవరి 11 : ఆడుదాం ఆంధ్రా రెండవ విడత మండల స్థాయి క్రీడా పోటీలు రెండవ రోజు కొనసాగాయి. గురువారం బాల్‌బ్యాడ్మింటన్‌లో నెల్లూరుపాళెం సచివాలయం నుంచి సీహెచ్ కార్తీక్, ఏ అశోక్ విన్నర్లుగా నిలిచారు. ఈనెల 24 నుంచి ప్రారంభమయ్యే నియోజకవర్గ స్థాయి పోటీలకు వీరు ఎంపికైనట్లు ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ ప్రకటించారు. అదేక్రమంలో క్రికెట్ సెమీఫైనల్ మ్యాచ్‌లు ముగిశాయి. శుక్రవారం ఎస్ఆర్ జెడీ క్రీడా ప్రాంగణంలో క్రికెట్ ఫైనల్స్‌తో పాటు మహిళల బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు తెలిపారు.

విధుల్లో చేరిన ఉద్యోగులు


ఎంఈవోకి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు


ఉదయగిరి రూరల్, జనవరి 11: మండలంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు గురువారం విధుల్లో చేరుతున్నట్లు ఎంఈవో మస్తాన్‌వలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ బుధవారం ప్రభుత్వంతో ఉద్యోగ సంఘ నాయకులు జరిపిన చర్చల్లో సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించినట్లు తెలిపారు.

గిరిజనులకు చీరలు, దుప్పట్ల పంపిణీ


గిరిజనులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న సర్పంచి ఆనం ప్రసాద్‌రెడ్డి

సంగం, జనవరి 11: మండలంలోని వెంగారెడ్డిపాళెంలో కాలువ గట్టుపై నివసిస్తున్న 17 గిరిజన కుటుంబాలకు గురువారం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. పద్మభూషణ్ వెన్నెలకంటి రాఘవయ్య మెమోరియల్ తరఫున గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొట్లూరి శ్రీనివాసులు సహకారంతో అందచేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

జేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న కాకర్ల సురేష్

వింజమూరు, జనవరి 11 : వింజమూరు మండలం జనార్ధనపురం గ్రామంలో జేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ ప్రారంభించారు. ముందుగా బత్తినవారిపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు. ఆటల పోటీలలో ప్రతిభ కనపరిచిన వారికి కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేయూతనివ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చాకలికొండ, జనార్ధనపురం గ్రామస్థులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏపీ ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న రైతు నేతలు, న్యాయవాదులు

ఆత్మకూరు, జనవరి 11: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆస్తులకు భంగం వాటిల్లే విధంగా తయారుచేసిన ల్యాండ్ టైటిల్ యాక్ట్-22 చట్టాన్ని రద్దు చేయాలని పట్టణంలోని న్యాయవాదుల సంఘం, ఆల్ ఇండియా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక సెషన్స్ కోర్టు వద్ద నుంచి పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి ఈచట్టం వలన జరిగే నష్టాలను ప్రజలకు వివరించారు. ప్రజా వ్యతిరేకమైన ఈ నల్ల చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కెవి శేషారెడ్డి, ఎల్వీ రమణయ్య, షేక్ నజీర్‌బాష, సిరాజ్, మధుసూదన్, రమేష్, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూలి వెంగయ్య, లక్కు కృష్ణప్రసాద్, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జి లక్ష్మీపతి, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మెగా క్రికెట్ టోర్నమెంట్

ఉదయగిరి రూరల్, జనవరి 11: మండలంలోని గుడినరవ గ్రామ ఎస్సీ కాలనీ క్రీడా మైదానంలో ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోటీల్లో విజేతలైన వారికి ప్రథమ బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేల నగదు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు రూ.550 ఎంట్రీ ఫీజు చెల్లించి 7904828190 నెంబర్‌కు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

సబ్ ట్రెజరీ కార్యాలయం తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న గంగాద్రి

ఉదయగిరి రూరల్, జనవరి 11: స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయంలో గురువారం జిల్లా ఖజానాధికారి గంగాద్రి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక తనిఖీలో భాగంగా కార్యాలయంలో రికార్డుల తనిఖీ చేపడుతున్నామన్నారు. తనిఖీల్లో లోపాలను గుర్తించి సిబ్బందికి సూచనలు ఇస్తామన్నారు. అదనంగా నిధుల చెల్లింపులు జరిగి ఉంటే రికవరీ విధిస్తామన్నారు. జిల్లాలో కావలి, వింజమూరు, ఉదయగిరి, ఆత్మకూరు మండలాల్లో నూతన సబ్ ట్రెజరీ భవనాలు పూర్తయ్యాయన్నారు. కోవూరు కార్యాలయ నిర్మాణానికి టెండర్లు పిలవడం జరిగిందన్నారు. బుచ్చిలో స్థలం సమస్య ఉండగా, పొదలకూరు భవన నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. నెల్లూరు ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీవో మమత, సీనియర్ అకౌంటెంట్లు బొమ్మతట్టు శ్రీహరి, కిశోర్‌కుమార్, తనిఖీ అధికారులు మోషే, మధుబాబు, నరేంద్ర, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మోటారు స్టార్టర్ల చోరీలను అరికట్టాలి

వింజమూరు, జనవరి 11 : పట్టణంలోని ఎర్రబల్లిపాలెం పొలాల్లో మోటార్లకు అమర్చిన స్టార్టర్ల వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించి తీసుకుపోతున్నట్లు రైతులు వాపోతున్నారు. వారు మాట్లాడుతూ వారం రోజుల నుంచి పొలాల్లోని మోటార్ల వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలిస్తున్నారని, దీనివల్ల నష్టం జరుగుతోందన్నారు. ముఖ్యంగా మంచు కురుస్తూ చలి తీవ్రత వలన పొలాల్లోకి రైతులు వెళ్లలేకపోవడంతో ఇలాంటి దొంగతనాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి చోరీలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

కంకర క్వారీలపై చర్యలు చేపట్టాలి


సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 11: తమ గ్రామంలో ఏర్పాటుచేసిన కంకర క్వారీలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లడంతో పాటు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వెంటనే వాటిపై తగిన చర్యలు చేపట్టాలని మండలంలోని బండకిందపల్లి గ్రామస్థులు ప్రజాప్రతినిధులు, అధికారుల ఎదుట వాపోయారు. గురువారం గ్రామంలో నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలో రేయింబవళ్లు క్రషర్లు పనిచేస్తుండడంతో వాటి పరిసరాల్లో సాగు చేస్తున్న పంటలు దుమ్ము, ధూళితో పూర్తిగా దెబ్బతిని ఆర్థికంగా నష్టపోతున్నామన్నామన్నారు. దీంతో అక్రమ క్వారీలపై చర్యలు చేపట్టాలని రాజగోపాల్‌రెడ్డి అధికారులకు సూచించడంతో పరిశీలించి చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, నాయకులు ఎల్‌పీ మాలకొండారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దారు రామ్మోహన్, ఎంపీడీవో సాయిప్రసాద్, ఉదయగిరి రేంజ్ అధికారి ఉమామహేశ్వరరెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయండి

ఉదయగిరి రూరల్, జనవరి 11: స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించే వైసీపీ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ జీ ఓబులరెడ్డి పేర్కొన్నారు. గురువారం వారు విలేఖరులతో మాట్లాడుతూ ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొంటారన్నారన్నారు. అలాగే శకునాలపల్లి పంచాయతీ కుర్రపల్లి గ్రామంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమృత్‌ధార వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, ఉప సర్పంచ్ ముర్తుజా, మాజీ వైస్ ఎంపీపీ బీ శ్రీనివాసులు, నాయకులు ఎస్థానీ, ఉప్పుటూరి శ్రీనివాసులు,తదితరులు పాల్గొన్నారు.

బీద రవిచంద్ర జన్మదిన వేడుకలు


అల్లూరులో రక్తదానం చేస్తున్న యువకులు

అల్లూరు, జనవరి 11 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర జన్మదిన వేడుకలను గురువారం అల్లూరులో నిర్వహించారు. తెలుగు యువత ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బీద గిరిధర్, పట్టణ అధ్యక్షుడు రామిశెట్టి కృష్ణచైతన్య తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాసులురెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, రఫీమాలిక్, నీలపరెడ్డి హరీష్, హారూన్ రషీద్, అరగల రమణయ్య, తోట శ్రీహరి పాల్గొన్నారు.

కావలి : బీద రవిచంద్ర జన్మదిన వేడుకలు గురువారం కావలిలో పోటాపోటీగా నిర్వహించారు. టీడీపీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో ఉదయం పార్టీ కార్యాలయంలో టీడీపీ శ్రేణులు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. టీడీపీలోని మరో వర్గం ఆధ్వర్యంలో సాయంత్రం ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో జన్మదిన వేడుకలను జరిపారు.

బిట్రగుంట : బోగోలు మండల టీడీపీ కార్యాలయంలో గురువారం బీద రవిచంద్ర పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నేతలు కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, యన్నాబత్తిన వెంకటేశ్వర్లు, యర్రం వేంకటేశ్వర్లురెడ్డి, గద్దే కొండయ్య, శ్రీనివాసులు, మనోహర్, పీ.హర్ష, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్ : ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో గురువారం టీఎస్ఎస్ఎఫ్ నాయకుడు చింతనబోయిన శివకృష్ణయాదవ్ ఆధ్వర్యంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

టీడీపీలో 16 కుటుంబాల చేరిక


టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఇంటూరి

గుడ్లూరు, జనవరి 11: మండలంలోని మెండివారిపాలెంలో వైసీపీకి చెందిన 16 కుటుంబాల వారు గురువారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పార్టీలో చేరుతున్న వారిని సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలు కప్పారు. టీడీపీలో చేరిన వారిలో ప్రళయకావేరి పోలయ్య, వాయిల భాస్కర్, వాయిల బాబు, వాయిల కుమార్, ప్రళయకావేరి గోవిందు, ప్రళయకావేరి ఏడుకొండలు, వాయిల సూరి, వాయిల రమణయ్య, వాయిల రాము, కాటంగారి నరసయ్య, కాటంగారి రామకృష్ణ, వాయిల బుజ్జెయ్య పి. పోలయ్య తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జే. నాగరాజు, జీ. హరిప్రసాద్, వీ కృష్ణ, బొజ్జా సుబ్బారావు, అట్ల కోటయ్య, బీ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణంలోని 27,28 వార్డుల పరిధి పడమర యాదవపాలెం, రజకపాలెంలో గురువారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి పార్టీ మినీ మ్యానిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్మోహనరెడ్డి సైకోచేష్టలు, చేతకాని పరిపాలనతో రాష్ట్రంలో దోపిడీలు, దందాలు అధికమయ్యాయని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, సవిడిబోయిన వెంకటకృష్ణ, బక్కమంతుల మనోజ్, హరీష్, మహిత తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే కుష్ఠు నివారణ

కావలి,జనవరి11: ప్రాథమిక స్థాయిలో కుష్ఠును గుర్తించి క్రమం తప్పకుండా మందులు వాడితే ఏడాదిలోనే వ్యాధి తగ్గిపోతుందని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ తెలిపారు. కావలి ఏరియా వైద్యశాలలోని ఏఆర్‌సీ సెంటర్, టీబీ ల్యాబ్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం డాక్టర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువారం కావలి ఏరియా వైద్యశాలతోపాటు కోవూరుపల్లి పీహెచ్‌సీ, కొండబిట్రగుంట, ముసునూరులలో కుష్ఠు వ్యాధి కేసులను చూశామన్నారు. 3 కేసులను గుర్తించామని, 10 సస్పెక్టడ్ కేసులను పరీక్షించి లెప్రసీ కాదని నిర్ధారించామన్నారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ పద్మావతి, ఆర్ఎంవో ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ జాతర


పోలేరమ్మను దర్శించుకున్న వంటేరు దంపతులు

జలదంకి, జనవరి11: మండలంలోని బ్రాహ్మణక్రాకలో గల నడివీధి పోలేరమ్మ జాతర గురువారం ముగిసింది. ముగింపురోజు అమ్మవారిని గ్రామస్థులు దర్శించుకుని కోర్కెలు తీర్చాలని మొక్కుకున్నారు. స్వగ్రామంలో జరుగుతున్న జాతరకు మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి-ఇందిరమ్మ దంపతులు హాజరు కావడంతో ఆచారి కాపులు దేవరపల్లి వెంకటరమణారెడ్డి, వేలమూరి శ్రీనివాసులురెడ్డిలు ఘనంగా సన్మానించారు. అనంతరం వంటేరు దంపతులను సర్పంచి ఇండ్ల సుధాకర్ దంపతులు కూడా సన్మానించారు. జాతర ముగింపు సందర్భంగా గ్రామంలో అమ్మవారి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు.

లాల్‌బహదూర్ శాస్త్రికి నివాళులు

కావలి,జనవరి11: దేశ రెండవ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి వర్ధంతి సందర్భంగా గురువారం వెంగళరావునగర్‌లోని లోకల్ లైబ్రరీ ఆవరణలో ఆయన చిత్రపటానికి పలువురు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నీతినిజాయితీకి మారు పేరు శాస్త్రి అని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, గ్రంథాలయాధికారి సునీత, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జికి సత్కారం

కావలి,జనవరి11: కావలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో జడ్జిగా పనిచేస్తున్న ఆర్. వరలక్ష్మి పశ్చిమగోదావరి జిల్లా నర్సాపూర్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఆమెను మాజీ ఏజీపీ పోట్లూరు శ్రీనివాసులు, ఇతర న్యాయవాదులు కలిసి సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాఘవయ్య, జోసఫ్, కోహిలీ, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ టాపర్‌గా వెంకట సాయిశృతి



కావలిటౌన్, జనవరి11: విట్స్ ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థిని అడ పాల వెంకట సాయిశృతి జేఎన్‌టీయూ టాపర్‌గా నిలిచింది. అనంతపురంలో జరిగిన స్నాత కోత్సవంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, జేఎన్‌టీయూ వీసీ రంగజనార్ధన్ చేతుల మీదుగా ఆమె బంగారు పతకం, గ్రాడ్యుయేషన్ పట్టా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను గురు వారం విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ప్రత్యూషారెడ్డి, ప్రిన్సి పాళ్ల దత్తాత్రేయశర్మ, సురేష్‌లు తదితరులు అభినందించారు.

సంక్రాంతి కానుక అందజేత

బిట్రగుంట : ముంగమూరు వద్ద ఉన్న ఆదరణ కేంద్రానికి కాంగ్రెస్ యువనేస్తం అధినేత సతీష్‌నాయుడు సంక్రాంతి కానుకగా రూ 15వేల విలు వయిన నిత్యావసర వస్తువులను గురువారం అందచేశారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు కే భవానీ మాట్లాడుతు పేదల ఆకలి తీర్చేందుకు సతీష్‌నాయుడు సొంత నిధులు అందచేస్తునందుకు కృతజ్ఞతలు తెలిపారు. గంగినాయుడు దాతృత్వంతో బోరు వేయించడం వల్ల నీ టి కొరత తీరిందన్నారు. కార్యక్రమంలో ఆదరణ కేంద్ర డైరెక్టర్ సింహాద్రిరావు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

బీసీఈఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

కావలిటౌన్, జనవరి11: బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ వారి క్యాలెండర్‌ను మున్సిపల్ మాజీ చైర్మన్ నగళ్ల శ్రీనివాస్ కిరణ్ తదితరులు గురువారం ఆవిష్కరించారు. అనంతరం తహసీల్దార్ మాధవరెడ్డి, తదితర అధికారులను కలిసి క్యాలెండర్‌లు బహూకరించారు. కార్యక్రమంలో బీసీఈఎఫ్ నేతలు అన్నం శ్రీనివాసులు, తుమ్మ రవి, వాసిలి సురేష్, పీ మాధవ, వీ మాధవ, చెన్ను కృష్ణయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ కమిటీల ఎంపిక

కావలిటౌన్, జనవరి11: ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఏసురత్నం మాదిగ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ కమిటీల ఎంపిక జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ సూరిపాక ఉదయ్‌కృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి చేవూరు కిరణ్, ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు జయంత్ పాల్గొని ఎంపికలను పర్యవేక్షించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా డీ వినోద్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా మనోహర్, ప్రధాన కార్యదర్శిగా రాజ్‌కుమార్, అధికార ప్రతినిధిగా అశోక్, ఉపాధ్యక్షులుగా శెట్టిపల్లి శామ్యేలు, హజరత్, శివయ్య ఎంపికయ్యారు. పట్టణ అధ్యక్షుడిగా మందా మహేష్, ప్రధాన కార్యదర్శిగా మందా రసూల్, ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడిగా కత్తి బుజ్జిబాబు, కార్యదర్శిగా శివకోటయ్య, పట్టణ అధ్యక్షుడిగా వరప్రసాద్, కార్యదర్శిగా మాధవ ఎంపికయ్యారు.

ఏప్రిల్ వరకు సాగునీరివ్వాలి

దగదర్తి(బిట్రగుంట), జనవరి 11: తలమంచి మేజర్ కెనాల్‌పై ఆధారపడ్డ రైతులకు ఏప్రిల్ వరకు సాగునీరు ఇవ్వాలని తాళ్ళూరి వెంకటకృష్ణ ప్రసాద్‌నాయుడు డిమాండ్ చేశారు. దగదర్తి మండల ఎంపీపీ కార్యాలయంలో గురువారం ఇరిగేషన్ అధికారులు, రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి వరకే సాగునీరు అందిస్తే, ఆలస్యంగా పంటలు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోతారని ఇరిగేషన్ డీఈ శ్రీనివాసులురెడ్డికి వివరించారు. రైతుల పంటలు నష్టపోకుండా ఉండాలంటే ఏప్రిల్ వరకు సాగునీరు ఇవ్వాలని ఎంపీపీ కోరారు. కార్యక్రమంలో రైతులు, సర్పంచులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ఎల్లంచర్ల శీనయ్య, ఇండ్ల రాజు, బాలవేణు, కాంద్ర శ్రీనివాసులు, గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

30 మద్యం సీసాల పట్టివేత


పట్టుబడిన మద్యం సీసాలతో ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి

గుడ్లూరు, జనవరి 11: అనుమతులు లేకుండా మద్యం అమ్ముతుండగా ఓ వ్యక్తిని పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు.ఈ సంఘటన మండలంలోని సాలిపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు, సాలిపేటకు చెందిన ఆకురాటి అశోక్‌కుమార్ చుట్టుపక్కల మద్యం దుకాణాల నుంచి మద్యం కొనుగోలుచేసి, వాటిని సాలిపేటలోని తన దుకాణంలో నిల్వఉంచి.అధిక ధరలకు విక్రయించేవాడని స్థానికులు కొందరు పోలీసులు సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు దాడిచేసి నిందితుడిని పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై ప్రసాద్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుడిని కందుకూరు కోర్టులో హాజరు పరచామని ఆయన తెలిపారు.

సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వలేటివారిపాలెం, జనవరి 11: మినుము, మిర్చి పంటల్లో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చునని కందుకూరు కేవీకే శాస్త్రవేత్త జీ ప్రసాద్ తెలిపారు. మండలంలోని బడేవారిపాలెం, నూకవరం గ్రామాల్లో సాగులో ఉన్న మిర్చి, మినుము పంటలను గురువారం ఆయన వ్యవసాయ, ఉద్యానవనశాఖాధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్చిలో పోషకాల లోపాల వలన ఆకు ముడత తెగులు ఆశించినట్లు తెలిపారు. నివారణకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏవో హేమంత్‌భరత్‌కుమార్, హెచ్‌వో బ్రహ్మసాయి, ఉద్యానవనశాఖ సహాయకులు ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ ఈవోపై ఎమ్మెల్సీ ఫిర్యాదు

వలేటివారిపాలెం, జనవరి 11: మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఈవో కేబీ శ్రీనివాసరావుపై ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆలయ ప్రాంగణంలో గత నెల 23న పోటు భవనం, టాయిలెట్ బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈవో ప్రొటోకాల్ పాటించకుండా, ఒకరిద్దరికీ మాత్రమే ఆహ్వానం పలికారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. దీంతో మాధవరావు గత నెల 24న కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ ఫిర్యాదుపై విచారించి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కందుకూరు సబ్‌కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఈవో సబ్ కలెక్టర్ కార్యాలయానికి హాజరై సంజాయిషీ చెప్పినట్లు తెలిసింది.

లింగసముద్రంలో జోరుగా పేకాట

లింగసముద్రం, జనవరి 11: మండలంలోని పలు గ్రామాల్లో పేకాట జోరుగా సాగుతోంది.ప్రతిరోజూ పేకాటలో రూ. లక్షలు చేతులు మారుతున్నాయి. లింగసముద్రం, తాతాహోటల్, మొగిలిచెర్ల, పెదపవని, వీఆర్ కోట తదితర గ్రామాల్లో పేకాట ముమ్మరంగా జరుగుతోంది. ఇక్కడ రోజుకు రూ.2 వేలు తీసుకొని పేకాట ఆడిస్తున్నట్లుగా స్థానికులు చెబుతున్నారు. పేకాట ఆడే సమయంలో పోలీసుల సమాచారం తెలిపేందుకు, అవసరమైన వస్తువులు తెచ్చి ఇచ్చేందుకు కొందరు సహాయకులను నియమించుకున్నారు. వారికి రోజుకు కొంత నగదు ముట్ట చెబుతున్నట్లు తెలిసింది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

కొండాపురం, జనవరి11: కాకర్ల ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు నియోజకవర్గ స్థాయిలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు కాకర్ల సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు ఈనెల 14, 15 తేదీల్లో ఇంటిముందు వేసుకున్న ముగ్గును సెల్ఫీ తీసుకొని ఫొటో, పేరు, ఊరు, మండలం, సెల్ నెంబరు తదితర వివరాలతో 15వతేదీ సాయంత్రం 6 గంటలలోగా మా వాట్సాప్ నెంబరు 94089 90899 నెంబరుకు పంపాలన్నారు. మండలానికి 10 మంది చొప్పున ఈనెల 18న వింజమూరు తమ ట్రస్టు కార్యాలయం వద్ద ముగ్గులు వేయాల్సి ఉంటుందన్నారు. మొదటి విజేతకు రూ 25,116, రెండవ విజేతకు 15,116, మూడవ విజేతకు రూ 10, 116, మరో పదిమందికి రూ 3,116 విలువగల ప్రత్యేక బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

తూతూ మంత్రంగా ఆడుదాం ఆంధ్రా..

కొండాపురం, జనవరి11: మండలంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు తూతూ మంత్రంగా జరుగుతున్నాయి. మండలంలో గురువారం జరిగిన క్రికెట్ పోటీలకు వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులకు కనీస వసతులు కరువయ్యాయి. ఎంపైర్లకు తాగునీరు, కూర్చునేందుకు కుర్చీలు కూడా ఏర్పాటుచేయలేదు. నీడ కోసం టెంట్లు వేయకపోగా ఎండలో కూర్చునేందుకు ఇష్టం లేక ప్రేక్షకులు ఆటలను చూసేందుకు రావడంలేదు. ఉదయం తీసుకువచ్చిన వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులకు భోజనవసతి కూడా ఏర్పాటు చేయలేదు.

'ఎమ్మెల్సీ పదవి ఇచ్చే పార్టీలకే ఓటు'

జలదంకి, జనవరి11: వచ్చే ఎన్నికల్లో యానాదులకు ఎమ్మెల్సీ పదవి, యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన పార్టీకే ఓట్లేస్తామని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య పేర్కొన్నారు. యానాదులతో ముఖాముఖిలో భాగంగా గురువారం జలదంకి మండలం నెహ్రూనగర్, అప్పారావుతోట గిరిజన కాలనీల్లో పర్యటించారు. ఆయన అక్కడి మహిళలతో ముఖాముఖి మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మన సమస్యలు తీరాలంటే చట్టసభల్లో ప్రాతినిధ్యం ఉండాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బృంద సభ్యులు మానికల మురళీ, మాకాని రవీంద్రబాబు, చెంబేటి లక్ష్మీ, కల్లూరి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.